RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 4 సంచిక : 13 మంగళవారం 10 ఫిబ్రవరి 2026 పేజీలు : 4 వెల : రూ. 2.00

## జీ7 దేశాలకన్నా వేగంగా భారత్ ఆర్థిక వృద్ధి

న్యూఢిల్లీ : భారత్ ఆర్థిక వృద్ధి వేగంగా దూసుకెళుతోంది. జీ7 దేశాలకన్నా మెరుగ్గా అభివృద్ధి సాధిస్తోంది. ఆ గణాంకాలను సంపద నిర్వహణ సంస్థ ఈక్విరస్ విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. "చాలా జీ7 దేశాల కన్నా నిర్మాణాత్మకంగా భారత్ మంచి స్థానంలో ఉంది. ఇదొక అద్భుతమైన మార్పు. ఒకపక్క అమెరికా వృద్ధి రేటు పడిపోతోంది. అదే సమయంలో ప్రపంచ జీడీపీ వృద్ధి (2025–2030)లో భారత్ సహకారం 15 శాతానికి పైగా ఉంటుందని అంచనా వేస్తున్నారు" అని ఆ నివేదిక తెలిపింది. గ్రామీణ ఎఫ్ఎంసీజీ డిమాండ్ పట్టణ ప్రాంతాలను మించిపోయిం దని చెప్పింది. విధాన ఆధారిత మూలధన వ్యయం 17.4 శాతం పెరిగిందని తెలిపింది. గ్లోబల్ జీడీపీ సహకారంలో జపాన్ (1 శాతం కన్నా తక్కువ), జర్మనీ (1.3 శాతం) కన్నా భారత్ ఎంతో మెరుగ్గా ఉంటుందని స్పష్టం చేసింది. తలసరి వ్యయంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య తేడా చాలా తగ్గిపోయిందని వెల్లడించింది.



# ప్రతి ఓటరు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి

## బీఆర్ఎస్‌కు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదు..

### బీజేపోళ్ళకు అసదుద్దీన్ నామస్మరణే ప్రధాన అజెండా - సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ : గత పదేళ్ల కాలంలో రాష్ట్రంలో తిరుగులేని అధికారాన్ని చెలాయించిన బీఆర్ఎస్ నాయకులు, ఇప్పుడు ప్రస్తుత ప్రభుత్వంపై విమర్శలు చేయడం హాస్యాస్పదమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల ప్రచార ముగింపు సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆయన, గత పాలకుల వైఫల్యాల వల్లనే నేటికీ మున్సిపాలిటీల్లో అనేక సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని విమర్శించారు. దశాబ్ద కాలం పాటు పాలన సాగించిన వారు తమ తప్పులను ఒప్పుకోకుండా, కొత్త ప్రభుత్వంపై విషం చిమ్మడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని ఆయన ధ్వజమెత్తారు. పార్లమెంటు స్థాయి నుండి గ్రామ పంచాయతీ వరకు అన్ని వ్యవస్థల్లోనూ బీఆర్ఎస్ ప్రతినిధులే ఉన్నా, ప్రజల కనీస అవసరాలను తీర్చడంలో వారు విఫలమయ్యారని సీఎం ఆరోపించారు. పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కొరతకు పదేళ్ల నాటి పాలకుల నిర్లక్ష్యమే కారణమని, ఇప్పుడు మళ్లీ ఏ మొహం పెట్టుకుని ప్రజలను ఓట్లు అడుగుతున్నారని ఆయన ప్రశ్నించారు. అభివృద్ధి చేయడంలో చేతులు ఎత్తేసిన వారు, ఇప్పుడు విమర్శలు చేయడంలో మాత్రం ముందుంటున్నారని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు వాస్తవాలను గమనించి తీర్పు ఇవ్వాలని, అభివృద్ధి నిరోధకులకు బుద్ధి చెప్పాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. పదేళ్లు అధికారంలో ఉండి చేయలేని పనులను, ఇప్పుడు తమ ప్రభుత్వంపై నెట్టడం వల్ల ప్రయోజనం లేదని ఆయన స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, గత పాలకులు సృష్టించిన అస్తవ్యస్త పరిస్థితులను చక్కదిద్దేందుకు సమయం పడుతుందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. చివరగా, ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలను ప్రజలు తిప్పికొట్టాలని రేవంత్ రెడ్డి కోరారు. అధికారం కోల్పోయిన అసహనంతోనే ఆ పార్టీ నాయకులు అసత్య ప్రచారాలకు తెరలేపుతున్నారని, వారికి ఓటు అడిగే అర్హత లేదని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలపడం ద్వారానే పట్టణాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రతి ఓటరు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బీజేపీ వాళ్లు రాముడి పేరు చెబుతారు కానీ రోజూ దండం పెట్టుకునేది అసద్దుదీన్ ఒవైసీకే అని విమర్శించారు. బీజేపీ వాళ్ల లైఫ్ లైనే అసదుద్దీన్ ఒవైసీ అని సెటైర్ వేశారు. ఒవైసీ పేరు లేకుండా, జపం చేయకుండా ఉండలేరని అన్నారు. రాముడి పేరు ఎన్నిసార్లు తలుచుకున్నారో, ఒవైసీ పేరు ఎన్నిసార్లు తలుచుకున్నారో ప్రజలే చూడాలన్నారు. ప్రతీసారి అసదుద్దీన్ ఒవైసీని అల్లావుద్దీన్ అద్భుత దీపంగా మార్చుకుని బీజేపీ వాళ్లు ఓట్లు అడుగుతారు అని సీఎం రేవంత్ ధ్వజమెత్తారు. 12ఏళ్లుగా అధికారంలో ఉన్నారు, మరి అసద్ ను ఏం చేశారు? ఎందుకు నియంత్రించలేకపోతున్నారు? అని ప్రశ్నించారు. ఇంకా ఎంతకాలం మత విద్వేషాలతో కాలం గడుపుతారు అని ధ్వజమెత్తారు. పార్లమెంటు స్థాయి నుండి గ్రామ పంచాయతీ వరకు అన్ని వ్యవస్థల్లోనూ బీఆర్ఎస్ ప్రతినిధులే ఉన్నా, ప్రజల కనీస అవసరాలను తీర్చడంలో వారు విఫలమయ్యారని సీఎం ఆరోపించారు. పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కొరతకు పదేళ్ల నాటి పాలకుల నిర్లక్ష్యమే కారణమని, ఇప్పుడు మళ్లీ ఏ మొహం పెట్టుకుని ప్రజలను ఓట్లు అడుగుతున్నారని ఆయన ప్రశ్నించారు. అభివృద్ధి చేయడంలో చేతులు ఎత్తేసిన వారు, ఇప్పుడు విమర్శలు చేయడంలో మాత్రం ముందుంటున్నారని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు వాస్తవాలను గమనించి తీర్పు ఇవ్వాలని, అభివృద్ధి నిరోధకులకు బుద్ధి చెప్పాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

పదేళ్లు అధికారంలో ఉండి చేయలేని పనులను, ఇప్పుడు తమ ప్రభుత్వంపై నెట్టడం వల్ల ప్రయోజనం లేదని ఆయన స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, గత పాలకులు సృష్టించిన అస్తవ్యస్త పరిస్థితులను చక్కదిద్దేందుకు సమయం పడుతుందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.




బంగారం, వెండి ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. ఇటీవల భారీగా పతనం అయిన ఈ రెండు లోహాల ధరలు మళ్లీ పైకెళుతున్నాయి. ఫ్యూచర్స్ మార్కెట్‌లో వెండి దాదాపు 5 శాతం మేర పెరిగింది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో వెండి కిలో మార్చి నెల కాంట్రాక్ట్ 4.74 శాతం మేర పెరిగి రూ. 2,61,745కి చేరింది. అంటే రూ. 11 వేలు పెరిగింది. 10 గ్రాముల మేలిమి పసిడి ధర ఏప్రిల్ కాంట్రాక్ట్ 1.3 శాతం పెరిగి రూ. 1,57,540కి చేరింది. అంటే దాదాపు రూ. 2 వేలు పెరిగింది. అంతర్జాతీయ విపణిలో స్పాట్ గోల్డ్ మళ్లీ 5 వేల డాలర్ల మార్కు దాటింది. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి ఔన్సు పసిడి ధర 5004 పలుకుతుండగా.. వెండి ఔన్సు 81 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. అంతర్జాతీయ ధరలను అనుసరించి దేశీయంగానూ వీటి ధరలు పెరిగాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో రూ. 1.60 లక్షలు పలుకుతుండగా.. వెండి ధర రూ. 2.70 లక్షల పైనే కొనసాగుతోంది. బంగారం, వెండిలో ఇటీవల భారీ కరెక్షన్ కారణంగా ధరలు దిగొచ్చాయి. వెండి ఏకంగా సగం వరకు పతనం అయ్యింది. దీంతో కనిష్ఠాల వద్ద ట్రేడర్ల నుంచి కొనుగోళ్ల మద్దతు లభిస్తోందని అనలిస్టులు పేర్కొంటున్నారు. డాలర్ విలువ పతనం కావడమూ మరో కారణం. మరోవైపు చైనా సెంట్రల్ బ్యాంక్ వరుసగా 15వ నెల కూడా పెద్ద మొత్తంలో పసిడిని కొనుగోలు చేయడంతో బంగారానికి డిమాండ్ పెరిగింది. ఈ వారం వెలువడనున్న అమెరికా ఉద్యోగ, ద్రవ్యోల్బణ గణాంకాలు ఫెడరల్ రిజర్వ్ పరపతి విధాన నిర్ణయాలు.. బంగారం, వెండి ధరలను ప్రభావితం చేయొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ రెండు లోహాల్లో ఇటీవల భారీస్థాయిలో కుదుపు రావడానికి చైనా ట్రేడర్ల స్పెక్యులేటివ్ ట్రేడింగే కారణమని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ పేర్కొన్నారు.

## డాలర్ ఢమాల్.. ట్రంప్‌కు చెక్ పెట్టిన భారత్.. ఒక్క డీల్‌తో తిరుగులేని శక్తిగా రూపాయి..



భారత కరెన్సీ రూపాయి సోమవారం మార్కెట్లో సత్తా చాటింది. అంతర్జాతీయ పరిణామాలు, ముఖ్యంగా భారత్–యూరోపియన్ యూనియన్ మధ్య కుదిరిన చారిత్రాత్మక వాణిజ్య ఒప్పందం దేశీయ మార్కెట్లకు కొత్త ఊపిరి పోసింది. గత శనివారం డాలర్‌తో పోలిస్తే 92 స్థాయికి పడిపోయి ఆల్ టైమ్ కనిష్టాన్ని తాకిన రూపాయి, సోమవారం నాటికి 19 పైసలు పుంజుకుని 91.71 వద్ద ముగిసింది. భారత్ – ఈయూ ఒప్పందం రూపాయి పుంజుకోవడానికి ప్రధాన కారణంగా చెప్పొచ్చు. 27 దేశాల కూటమితో కుదిరిన ఈ ఒప్పందం భారత ఎగుమతులకు సుంకం లేని మార్కెట్‌ను కల్పిస్తుంది. దీనిని నిపుణులు మదర్ ఆఫ్ ఆల్ డీల్స్‌గా అభివర్ణిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ఆరు ప్రధాన కరెన్సీలతో పోలిస్తే డాలర్ విలువ 0.12శాతం తగ్గి 96.92కు పడిపోయింది.

గత ఏడాదిలో డాలర్ ఏకంగా 10శాతం పతనమవ్వడం రూపాయికి కలిసి వచ్చింది. భారత్ విదేశీ మారక నిల్వలు ఏకంగా 14.16 బిలియన్ డాలర్లు పెరిగి 701.36 బిలియన్ డాలర్ల మార్కును చేరడం దేశ ఆర్థిక బలానికి నిదర్శనంగా నిలిచింది.

**స్టాక్ మార్కెట్ జోరు...** సెలవు తర్వాత తెరుచుకున్న మార్కెట్లు లాభాలతో కళకళలాడాయి. సెన్సెక్స్ 319 పాయింట్లు పెరిగి 81,857 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 126 పాయింట్ల లాభంతో 25,175 వద్ద ముగిసింది. జుఖ ఒప్పందం కారణంగా రాబోయే రోజుల్లో మార్కెట్ మరింత పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

**ట్రంప్ –అమెరికాపై ఒత్తిడి..** భారత్–జుఖ ఒప్పందం తర్వాత ఇప్పుడు అమెరికాపై ఒత్తిడి పెరిగింది. భారత వస్తువుల కోసం యూరప్ ఒక పెద్ద మార్కెట్‌గా మారడంతో అమెరికా కూడా భారత్‌తో త్వరగా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మార్చిలో కెనడాతో కూడా భారత్ కీలక చర్చలు జరపనుంది. దీంతో డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం భారత్‌కు దగ్గరయ్యే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

**అడ్డంకులు ఇవే...** రూపాయి ఇంకా పెరగాల్సి ఉన్నప్పటికీ, రెండు అంశాలు దాని వేగాన్ని అడ్డుకున్నాయి.. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్‌కు 65.84 డాలర్లకు పెరగడం రూపాయిపై ఒత్తిడి తెచ్చింది. విదేశీ పెట్టుబడిదారులు జనవరిలో ఇప్పటివరకు సుమారు రూ. 36,811 కోట్ల విలువైన షేర్లను విక్రయించి లాభాలను స్వీకరించారు. అంతర్జాతీయ ప్రతికూలతల మధ్య కూడా భారత్ తన ఆర్థిక పట్టును నిరూపించుకుంటోంది. రాబోయే రోజుల్లో రూపాయి విలువ 91.30 స్థాయికి చేరుకోవచ్చని నిపుణులు భావిస్తున్నారు.

# చూడతరమా 'సోషల్' సిత్రాలు!

## సోషల్ మీడియాను వాడేస్తున్నారు!!

### సోషల్ మీడియాలో ప్రధాన పార్టీల పరస్పర ఆరోపణలు

### వార్డుల స్థాయిలో ప్రత్యేక వాట్సాప్ గ్రూపులు




హైదరాబాద్ : మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు సమయం దగ్గర పడుతున్న వేళ రాజకీయ పోరు కొత్త మలుపు తిరిగింది. రోడ్లపై, వీధుల్లో ఫ్లెక్సీల ఏర్పాటు, పార్టీ కండువాలు కప్పుకొని గల్లీల్లో ప్రచారంతో పాటు సోషల్ మీడియాలోనూ ప్రధాన పార్టీలు తలబడుతున్నాయి. ఫేస్‌బుక్, వాట్సాప్ గ్రూపులు, ఎక్స్ వేదికగా చేసుకుని పరస్పర ఆరోపణలతో మెదక్ జిల్లాలో సోషల్ వార్ కొనసాగుతోంది. అధికార పార్టీ అభివృద్ధి పనుల ఫొటోలు, వీడియోలు విడుదల చేస్తున్నది. ప్రతిపక్ష పార్టీలు ఆయా పనులు కాగితాలకే పరిమితమయ్యాయని ఆరోపణలు చేస్తున్నాయి. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, అసంపూర్తిగా ఉన్న పనులను ప్రస్తావిస్తూ వీడియో క్లిప్పింగ్‌లు వైరల్ చేస్తున్నాయి. వార్డుస్థాయి యువ నాయకులతో పాటు ప్రత్యేక సోషల్ మీడియా టీమ్‌లు రంగంలోకి దిగాయి. ఒక పార్టీ చేసిన పోస్టుకు వెంటనే కౌం టర్ పోస్టులు, ట్రోల్స్ వస్తుండడంతో రాజకీయ చర్చలు వ్యక్తిగత విమర్శల దిశగా మళ్లుతున్నాయి. కొన్నిచోట్ల అభ్యర్థుల వ్యక్తిగత జీవితా లను టార్గెట్ చేస్తూ పోస్టులు పెట్టడం వివాదస్పదంగా మారుతోంది. రాజకీయ అవగాహన కంటే భావోద్వేగాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తూ, ధ్రువీకరణ లేని సమాచారాన్ని షేర్ చేయడం పెరిగిందన్న విమర్శలు ఉన్నాయి.

ఎడిట్ చేసిన వీడియోలు, పాత ఫొటోలను తాజా సమాచారమంటూ ప్రచారం చేయడంతో యువ ఓటర్లలో గందరగోళం ఏర్పడుతోంది. వాస్తవమేదైనా తమ పోస్టులు ఎంత వైరల్ అయ్యాయన్నదే ముఖ్యంగా మారింది. దీంతో వార్డడల్లో సమస్యలు పక్కకు నెట్టబడుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**మీ హయాంలో ఏం చేశారు?...** మున్సిపాలిటీల్లో గత పాలనలో జరిగిన పనులపై సోషల్ మీడియాలో వాదోపవాదాలు హోరెత్తిస్తున్నారు. మీ హయాంలో ఏం చేశారంటే... మీ హయాంలో ఏం చేస్తున్నారు.. అంటూ ఒకరిపై ఒకరు విరుచుకుపడుతున్నారు. దీంతో ప్రధాన సమస్యలైన తాగునీరు, డ్రైనేజీలు, రోడ్ల గురించి చర్చ జరగడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఇది చాలదన్నట్లు వాట్సాప్‌లో ఫేక్ మెసేజ్‌లు, ఎడిట్ చేసిన వీడియోలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై ఎన్నికల అధికారులు, సైబర్ విభాగం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ప్రజలు భావిస్తున్నారు.

సోషల్ మీడియా కోడ్ అమలుపై కఠిన చర్యలు తీసుకోవలన్న డిమాండ్ కూడా పెరుగుతోంది. మొత్తానికి మున్సిపల్ ఎన్నికల వేళ బ్యాలెట్‌కు ముందే డిజిటల్ బ్యాటిల్ హీటెక్కింది.

**వార్డుల్లో గ్రూపులు...** మున్సిపాలిటీల్లోని ఆయా పార్టీల సోషల్ మీడియా టీమ్‌లలో యువతే ఎక్కువగా కనిపిస్తున్నారు. వార్డు స్థాయిలో ప్రత్యేక వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి అభ్యర్థి ఫొటోలు, వీడియోలు, నినాదాలను విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. యువత రాజకీయాల్లోకి రావడానికి సోషల్ మీడియా సులువైన వేదికగా మారింది.

నేరుగా నేతలతో భేటీ అవసరం లేకండా తమ అభిప్రాయాలను బయట పెట్టే అవకాశం లభిస్తోంది. అభివృద్ధి పనుల ఫొటోలు, లోపాలపై విమర్శలు ప్రభుత్వ పథకాలపై చర్చలు... అన్నీ ఇప్పుడు ఫోన్ స్ర్కీన్ మీదే జరుగుతున్నాయి. ఏదోవిధంగా యువత రాజకీయాల్లో భాగం కావడం ప్రజాస్వామ్యానికి మంచి సంకేతమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# సంపాదకీయం

## క్వాంటం కంప్యూటింగ్ అంటే ఏంటీ? దాంతో ఏంటి ప్రయోజనం?

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి సరికొత్త చరిత్రకు వేదికైంది. ఐటీ రంగంలో హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో నిలిపిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పుడు అమరావతిని భవిష్యత్ టెక్నాలజీ 'క్వాంటం కంప్యూటింగ్'కు గ్లోబల్ హబ్‌గా మార్చే దిశగా అడుగులు వేశారు. శనివారం తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో దేశంలోనే మొట్టమొదటి 'అమరావతి క్వాంటం వ్యాలీ' భవన నిర్మాణానికి కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్‌తో కలిసి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. సిలికాన్ వ్యాలీ గతం.. క్వాంటం వ్యాలీ వర్తమానం! ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. "గతంలో సిలికాన్ వ్యాలీ ఐటీ విప్లవానికి నాంది పలికితే రాబోయే రోజుల్లో క్వాంటం వ్యాలీ ప్రపంచాన్ని శాసించబోతోంది. హైదరాబాద్‌కు హైటెక్ సిటీ ఎలాగో, దేశానికి అమరావతి క్వాంటం వ్యాలీ అలా గేమ్ ఛేంజర్ కానుంది. ఈ ఏడాది డిసెంబర్ నాటికి అమరావతిలో దేశంలోనే మొదటి 133 క్యూబిట్ క్వాంటం కంప్యూటర్‌ను అందుబాటులోకి తెస్తాం" అని ప్రకటించారు. ప్రాజెక్టు ప్రత్యేకతలు: సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో ఈ వ్యాలీ రూపుదిద్దుకోనుంది. 48 అంతస్తులు, 29 అంతస్తులతో కూడిన ఎనిమిది భారీ టవర్లను నిర్మిస్తున్నారు. ఐబీఎం , టీసీఎస్ , ఎల్ అండ్ టీ వంటి దిగ్గజ సంస్థలు ఈ ప్రాజెక్టులో భాగస్వాములుగా ఉన్నాయి. 2030 నాటికి దేశానికి అవసరమైన 2.5 లక్షల క్వాంటం నిపుణులలో మెజారిటీ వాటా అమరావతి నుంచే ఉండేలా శిక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఎందుకు ఈ క్వాంటం టెక్నాలజీ? సాధారణ కంప్యూటర్లు సంవత్సరాల తరబడి చేసే క్లిష్టమైన లెక్కలను క్వాంటం కంప్యూటర్లు కేవలం సెకన్లలో పూర్తి చేస్తాయి. దీనివల్ల వాతావరణ అంచనాలు, క్యాన్సర్ వంటి వ్యాధులకు కొత్త మందుల తయారీ, హ్యాకింగ్‌కు గురికాని సైబర్ సెక్యూరిటీ, గ్రీన్ హైడ్రోజన్ వంటి రంగాల్లో విప్లవాత్మక మార్పులు రానున్నాయి. అరుదైన పురస్కారం.. ?100 కోట్ల బహుమతి! పరిశోధనలను ప్రోత్సహించేందుకు చంద్రబాబు ఒక సంచలన ప్రకటన చేశారు. క్వాంటం టెక్నాలజీ రంగంలో ఎవరైనా నోబెల్ బహుమతి సాధిస్తే వారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున 100 కోట్ల నగదు బహుమతి అందజేస్తామని ప్రకటించారు. యువత విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అమరావతే నాలెడ్జ్ హబ్‌గా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు.

## క్రీడలతో శారీరిక దారుఢ్యంతో పాటుగా మానసిక ఉల్లాసం కూడా లభిస్తుంది : అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి






శామీర్ పేట, ఫిబ్రవరి 9 (గరుడ వార్త) : క్రీడలతో శారీరక దారుఢ్యంతోపాటు మానసిక ఉల్లాసం సైతం లభిస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి తెలిపారు. శామీర్ పేట మండలం హకీంపేట పరిధిలోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్లో జిల్లాస్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను ముఖ్యఅతిథిగా అదనపు కలెక్టర్ విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్ మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ కనబరిచి రాణిస్తే వారు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని తెలిపారు. సోమవారం జరిగిన కబడి, వాలీబాల్, ఖో ఖో, ఫుట్ బాల్ అండ్ సైక్లింగ్ నిర్వహించగా ఇందులో సుమారు 500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ క్రీడా పోటీలలో గెలుపొందిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని జిల్లా యువజన, క్రీడల అధికారి చెప్పారు. అలాగే రాష్ట్రస్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు నగదు బహుమతి (మొదటి బహుమతి రూ. 1 లక్ష, రెండో బహుమతి రూ. 75 వేలు , మూడో బహుమతి రూ. 50 వేలు) ఉంటుందని జిల్లా అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ స్కూల్ ఓ ఎస్ డి మమత, జిల్లా విద్యాశాఖ అధికారి విజయ కుమారి, ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకునేలా ప్రతి ఒక్కరు సహకరించాలి.. : శామీర్ పేట సి ఐ శ్రీనాథ్




శామీర్ పేట, ఫిబ్రవరి 9 ( గరుడ వార్త) : మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛాయుత ప్రశాంత వాతావరణంలో వినియోగించుకునేలా ప్రతి ఒక్కరు సహకరించాలని శామీర్ పేట సీఐ శ్రీనాథ్ సూచించారు. శామీర్ పేట పోలీస్ ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలను శాంతియుతంగా, స్వేచ్ఛాయుతంగా, న్యాయ బద్ధంగా నిర్వహించేందుకు శామిర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో అన్ని ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సోమవారం సాయంత్రం ప్రచారం ముగిసిందని, 144 సెక్షన్ ఉన్నందున ప్రజలు గుంపులుగా తిరగవద్దని చెప్పారు. పోలింగ్ బూత్‌లు, పోలింగ్ స్టేషన్లు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల వద్ద, పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన అమలులో ఉంటుందని, గుంపులు గుంపులుగా తిరగరాదన్నారు. ఎన్నికల బందోబస్తు నిమిత్తం సుమారు 200 మంది పోలీస్ సిబ్బందిని మోహరించినట్లు తెలిపారు. ప్రచార సమయం ముగిసినందున ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు తిరిగి వెళ్లిపోవాలని సూచించారు. రాత్రి వేళల్లో అనుమానాస్పదంగా ఎవరూ తిరగరాదని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటర్లను ప్రభావితం చేసే విధంగా మద్యం, డబ్బు, బహుమతులు వంటి ప్రలోభాలకు పాల్పడితే సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సోషల్ మీడియా, మొబైల్ ఫోన్లో సైతం ప్రచారం పై ఆంక్షలు ఉన్నట్లు తెలిపారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని చెప్పారు. ప్రజలందరూ ఎన్నికల నిబంధనలను పాటిస్తూ శాంతియుతంగా ఎన్నికలు జరిగేందుకు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.–

## ప్రభుత్వ సంక్షేమ పథకాలే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించనున్నాయి : ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్ రెడ్డి



శామీర్ పేట, ఫిబ్రవరి 9 (గరుడ వార్త) : ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించనున్నాయని ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా సోమవారం లాల్ గడి మలక్ పేటలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించాడు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో నిర్వహిస్తున్న మున్సిపల్ ఎన్నికల్లో మహిళలు కాంగ్రెస్ పార్టీ గెలుపునకు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థులు ప్రజలకు ఇస్తున్న హామీలను ప్రభుత్వం నుంచి తాను తప్పని సరిగా నేరవేరుస్తామని ఆయన బరోసా కల్పించారు. మేడ్చల్ జిల్లాలో జరుగుతున్న ఎన్నికల్లో మూడు మున్సిపాల్టీల్లో అన్ని వార్డులను కైవసం చేసుకుని కాం గ్రెస్ జెండాను ఎగుర వేస్తామని ఆయన వివరించారు. మున్సిపల్ ఎన్నికల్లో ముఖ్యంగా జిల్లాలో తాను 3500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయించడం వల్ల కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థులు అధిక మెజార్టీతో గెలువడం ఖాయమని తెలిపారు. ప్రస్తుత మ న్సిపల్ ఎన్నికల్లో ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఆయన అనుచరలు నోట్ల కట్టలతో ఎన్నికల ప్రచారం చేస్తున్నారని, వారికి ఈ ఎన్నికల్లో ప్రజలే సరైన బుద్ధి చెప్పి బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడించడం తధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్ రెడ్డి, రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్, జిల్లా ఆర్టీఏ సభ్యుడు జైపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వంద పడకలు.. అత్యవసర వైద్యం అందదు!



చొప్పదండి : గ్రామీణులకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలనే ఉద్దేశంతో నియోజకవర్గ కేంద్రమైన చొప్పదండికి రెండేళ్ల కిందట వంద పడకల ఆసుపత్రి మంజూరైంది. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇందుకు రూ.35.70 కోట్లు మంజూరుకావడంతో భవన నిర్మాణ పనులు చకచకా పూర్తి చేశారు. ఆ పనులు పూర్తయినప్పటికీ ప్రారంభానికి ఆలస్యం అవుతోంది. దీంతో ప్రస్తుతం చొప్పదండిలోని 30 పడకల సామాజిక ఆసుపత్రిలో ప్రాథమిక వైద్యం అందుతుండగా అత్యవసర వైద్యం కోసం కరీంనగర్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

**సిబ్బందిని నియమిస్తేనే..**

మూడున్నర ఎకరాల విస్తీర్ణంతో 120 గదులతోపాటు ఆపరేషన్ థియేటర్, క్యాజువాలిటీ వార్డు, ఎక్స్‌రే, స్కానింగ్ తదితర గదులు నిర్మించారు. దీంతోపాటు చుట్టూ ప్రహరీ పూర్తయింది. ఆసుపత్రికి కావాల్సిన కొన్ని పరికరాలు ఇప్పటికే సమకూరగా మరికొన్ని రావాల్సి ఉంది. ప్రాథమిక వైద్యంతోపాటు జనరల్ ఫిజీషియన్, సర్జన్, గైనకాలజిస్టు, రేడియాలజిస్టు, అనస్తీషియా, ఆర్థో, పీడియాట్రిక్, కంటి, దంత, ట్రామా తదితర వైద్య సేవల నిమిత్తం వైద్యులతోపాటు ఇతర సిబ్బందిని నియమించాల్సి ఉంది. ఐసీయూ, సెంట్రల్ ఆక్సిజన్, ఇతర ఖరీదైన పరీక్షలకు సంబంధిత పరికరాలు అందుబాటులోకి తెస్తే ప్రజలకు మెరుగైన సేవలు అందనున్నాయి. పూర్తి స్థాయిలో సిబ్బంది నియామకం జరిగితే కార్పొరేట్ స్థాయిలో ఈ ప్రాంతవాసులకు అధునాతన వైద్య సేవలు అందే అవకాశం ఉంది.

**ప్రతిపాదనలు పంపించాం** ఆసుపత్రిలో సిబ్బంది నియామకానికి ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. కొన్ని పరికరాలు రావాల్సి ఉంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. తొందర్లో సిబ్బందిని నియమించే ప్రక్రియ పూర్తవుతుంది. సిబ్బంది నియామకం అయిన వెంటనే ఆసుపత్రిని ప్రారంభించే అవకాశాలున్నాయి. డాక్టర్ కృష్ణప్రసాద్, ఆసుపత్రి పర్యవేక్షకులు

## ముగిసిన ప్రచారం .. మొదలైన ప్రలోభాల పర్వం

నిజామాబాద్ ఫిబ్రవరి 9 : మున్సిపల్ ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రం ఐదు గంటలకు ముగిసిం ది. గత 15 రోజులుగా పురపాలిక ఎన్నికల సందడి, కాలనీలలో ప్రచార సందడి కొనసాగింది. ప్రధానపార్టీల అభ్యర్థులతో పాటు ఆ పార్టీల ముఖ్య నేతలు ప్రచారం నిర్వహించారు. ఈనెల 11న మున్సిపల్ ఎన్నికలకు ఓటింగ్ జరగనుంది. 13వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఓటింగ్, కౌంటింగ్ కు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. సోమవారం సాయంత్రం తో ఎన్నికల ప్రచారం ముగియ డంతో ప్రలోభాల పర్వం మొదలైంది. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా బోధన్, ఆర్మూర్, భీమ్ గల్ మున్సిపాలిటీలతోపాటు నిజామాబాద్ కార్పొరేషన్ ఎన్నికలను ప్రధాన పార్టీలు సవాల్ గా సేకరించారు. ఈనెల ఆరవ తేదీన ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పర్యటించా రు. అదేవిధంగా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తన సొంత జిల్లా కావడంతో నిజామాబాద్ లో మకాశీ వేసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించేందుకు విశ్వ ప్రయత్నాలు చేపట్టారు. అదేవిధంగా బిజెపి సైతం మెజార్టీ స్థానాలను కైవసం చేసుకునేందుకు ముందుకు వెళుతుంది. నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ జిల్లాలో సుడిగాలి పర్యటన చేపట్టారు. ఆదివారం నగరంలోని వినాయక నగర్ లో నిర్వహించిన బిజెపి కార్నర్ మీటింగ్ కు మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు పాల్గొన్నారు. ప్రచారంలో చివరి రోజు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా బిజెపి, కాంగ్రెస్ నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగింది. పరస్పరం ఒకరిపై ఒకరు విమర్శల అస్త్రాన్ని సంధిస్తూ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అదేవిధంగా ఇంటింటి ప్రచారంతో అలసిపోయిన అభ్యర్థులు ప్రచారపర్వం ముగియడంతో ఓటర్లను స్వయంగా కలిసి తమకు ఓటు వేయాలని కోరేందుకు సిద్ధమవుతున్నారు. ఓటింగ్ Siva ఇంకా ఒక్కరోజే మిగిలి ఉండడంతో ఓటర్ దేవుళ్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రలోభాలకు తెర లేపారు.

## చురుగ్గా ఎంఎంటీఎస్ పనులు

భువనగిరి : దశాబ్దకాలంగా ఎదురుచూస్తున్న ఎంఎంటీఎస్ కల ఎట్టకేలకు నెరవేరబోతోంది. సికింద్రాబాద్ – కాజీపేట మార్గంలో ఘట్కేసర్ నుంచి వంగపల్లి వరకు ఎంఎంటీఎస్ సేవలను పొడిగించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు 38.46 కిమీ పొడవునా కొత్త ట్రాక్ వేసే పనులకు ముందడుగు పడింది. యాదగిరి గుట్ట దివ్యక్షేత్రానికి వచ్చే భక్తులు, రోజు వారి వ్యాపార, వాణిజ్య అవసరాలు, విద్యార్థులు, ఉద్యోగులకు రైలు సౌకర్యం మెరుగుపడటంతో పాటు చౌకధరలో ప్రయాణించే అవకాశం కలుగుతుంది.

మారిన కొత్త అంచనాల ప్రకారం రూ.464 కోట్లతో ఘట్కేసర్ – వంగపల్లి రైల్వే స్టేషన్ వరకు విస్తరణ అభివృద్ధికి కేంద్రం పచ్చజెండా ఊపింది. ఇందుకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఫలితంగా 2025–26 కేంద్ర బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయించారు. దీంతో పనులు మూడు నెలల క్రితం ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం ఈ మార్గంలో రెండు ప్రధాన ట్రాక్‌లు ఉన్నాయి. విస్తరణలో భాగంగా కాజీపేట వైపు మార్గంలో అదనంగా మూడో మార్గం వేసే పనులు మొదలయ్యాయి. ఆర్‌వీఎన్‌ఎల్ సంస్థ ఈ పనులు చేపడుతోంది. బీబీనగర్ మండలం కొండమడుగు నుంచి వంగపల్లి వరకు రైల్వే శాఖ ఆధీనంలో ఉన్న స్థలంలో వంతెనలు, కల్వర్టులు, ట్రాక్ వేయడానికి భూమిని లెవలింగ్ పనులు కొనసాగుతున్నాయి. మొదటి ఫేజ్‌లో వంగపల్లి –రాయగిరి(యాదాద్రి)– భువనగిరి– పగిడిపల్లి రైల్వేస్టేషన్ వరకు 2026–27లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రెండో దశలో పగిడిపల్లి–బీబీనగర్–ఘట్కేసర్ 2027–28 వరకు పూర్తి చేయాలని ప్రతిపాదించారు.

భూసేకరణ జరగాల్సి ఉంది. ఈ మేరకు రైల్వే అధికారులు కలెక్టర్‌కు పలు వివరాలు అందజేశారు. సర్వే పూర్తయితే పనులు ఇంకా వేగంగా జరిగే అవకాశం ఉంది.

## ఎక్కడ ప్రమాదం జరిగినా.. ఇట్టే తెలుస్తుంది!

భానుపురి : జాతీయ రహదారిపై ఇక నిఘా పెంచనున్నారు. ఎక్కడ ప్రమాదం జరిగినా..అతివేగంతో వాహనాలు నడిపినా క్షణాల్లో కంట్రోల్ రూంకు సమాచారం అందేలా ఎన్‌హెచ్‌ఏఐ దేశవ్యాప్తంగా ఈ వ్యవస్థకు ఏర్పాట్లు చేస్తోంది. తొలుత ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల నుంచి 44వ జాతీయ రహదారిపై నిఘా కెమెరాలు, ఆర్చిలను ఏర్పాటు చేసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇక్కడ పూర్తయిన తర్వాత హైదరాబాద్–విజయవాడ సహా తెలంగాణలోని అన్ని జాతీయ రహదారులపై నిఘా నేత్రాలు ఏర్పాటు కానున్నాయి.

కి.మీ.కి కెమెరా: కిలోమీటరుకు ఒకటి చొప్పున కెమెరా ఏర్పాటు చేసి, చోదకుల సౌలభ్యం కోసం ఓవర్‌హెడ్ ఆర్చిలను నిర్మించి ఆయా గ్రామాలు, పట్టణాల పేర్లు, ఎంత దూరంలో ఉన్నాయనే వివరాలను ప్రదర్శించనున్నారు. ఆరేడు నెలల్లో ఈ వ్యవస్థ ఉమ్మడి జిల్లాలోని జాతీయ రహదారులపై అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

నిర్వహణ ఇలా..: ఈ సీసీ కెమెరాల సహాయంతో కంట్రోల్ రూంలో నిరంతర నిఘా కొనసాగిస్తారు. ప్రతి టోల్‌ప్లాజా వద్ద ఒక రూం అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రమాదాలు జరిగితే క్షణాల్లో కంట్రోల్ రూంకు సమాచారం అందుతుంది. సుదూరంగా ప్రయాణించే చోదకులకు ఓవర్ హెడ్ ఆర్చిలు సౌకర్యంగా ఉంటాయి. వీటితో అత్యధిక ఎత్తు లోడ్‌తో వెళ్లే వాహనాలను నిలువరించవచ్చు. ఎక్కడైనా వాహనం ప్రమాదానికి గురైతే తక్షణమే నిఘా కెమెరాల ద్వారా తెలిసిపోతుంది. జాతీయ రహదారుల పెట్రోలింగ్, అంబులెన్స్ సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకొని సత్వర న్యాయం అందించేందుకు వీలవుతుందని సంబంధిత అధికారులు భావిస్తున్నారు.

# వానొస్తే నీళ్లు.. ఆగవు కన్నీళ్లు..!

ఖమ్మం: పట్టణాల్లోని శివారు కాలనీలు, లోతట్టు ప్రాంతాలు వర్షాకాలంలో చెరువులను తలపిస్తున్నాయి. వరద జలాలు ఇళ్లను ముంచెత్తుతున్నాయి. దశాబ్దాలుగా ఈ సమస్య వేధిస్తున్నా.. తాత్కాలిక ఉపశమనం కలిగించేందుకు పాలకులు యత్నిస్తున్నారు తప్ప శాశ్వత పరిష్కారం దిశగా చొరవ చూపటం లేదనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. ముంపు నివారణ చర్యల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిధులు మంజూరుచేసినా.. పనులు పట్టాలెక్కలేదు. నగరపాలిక/పురపాలికల్లో త్వరలో కొలువుదీరే నూతన పాలకవర్గాలు ఈ విషయంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

**పనులు పరుగులు పెడితేనే మోక్షం**

మధిరలోని హనుమాన్‌కాలనీ, వరద రాఘవాపురం, ముస్లింకాలనీని అంబారుపేట చెరువు నీరు ముంచుతోంది. వైరా నది ఒడ్డునున్న లడక్‌బజార్ భారీ వరదలకు ముంపునకు గురవుతోంది. ఏటా వర్షాకాలంలో వారం, పది రోజులు నీళ్లు నిలుస్తుండటంతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. పునరావాస కేంద్రాలకు తరలుతున్నారు. శాశ్వత పరిష్కారం కోసం రిటైనింగ్ వాల్ నిర్మించటానికి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జనవరిలో శంకుస్థాపన చేశారు. వచ్చే వానాకాలంలో ముంపు ఇక్కట్లు తలెత్తకుండా పనులు పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

భారీ వర్షాలు కురిస్తే కల్లూరు అంబేద్కర్‌నగర్‌లో నీళ్లు నిలుస్తున్నాయి.



ఖమ్మం–దేవరపల్లి జాతీయ రహదారికి రెండువైపులా మురుగుకాల్వలు నిర్మించకపోవటంతో వరదనీరు నిలిచి రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. గోపాలకుంట పరిసరాల్లోని లోతట్టు ప్రాంతాలను అలుగు నీరు ముంచెత్తుతుంది. ఇక్కడ కరకట్ట కట్టాలి. మధిర వెళ్లే మార్గంలో గోపాలదేవబోయినపల్లి రహదారిపై వర్షం నీటిని తరలించటానికి డ్రైనేజీ నిర్మించాలి. నివారణ చర్యల నిమిత్తం ప్రభుత్వం రూ.15కోట్లు మంజూరు చేసింది. పనులు ప్రారంభించి త్వరగా పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

వైరా ఇందిరమ్మకాలనీలోని సుమారు 80 ఇళ్లను ఏటా సోమారం నల్లచెరువు అలుగు నీరు ముంచుతోంది. 15ఏళ్లుగా వేధిస్తున్న ఈ సమస్య పరిష్కారానికి రూ.4.50కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదించారు. మోక్షం దక్కటం లేదు. వైరా జలాశయం నిండితే రాజీవ్‌నగర్‌లోకి నీళ్లు వస్తున్నాయి. పట్టణంలోని వరదనీరు సత్రం బజారులోకి చేరుతోంది. పెద్ద మురుగుకాల్వ నిర్మాణానికి నిధులు మంజూరవగా ఇటీవల శంకుస్థాపన చేశారు. త్వరగా పనులు పూర్తయితే గండం నుంచి గట్టెక్కవచ్చు.

**తప్పని ఎదురుచూపులు**

ఇల్లెందులోని సత్యనారాయణపురంలో 3, 5, 19, 20 వార్డులు వర్షాకాలంలో ముంపునకు గురవుతాయి. బుగ్గవాగులో చెత్తాచెదారం పేరుకుపోవటంతో ఇల్లెందులపాడు చెరువు మత్తడి నీరు పారక పరిసర కాలనీలను ముంచెత్తుతోంది. చెరువుతోపాటు బుగ్గవాగులో పూడిక తీసి, వాగుకు రెండువైపులా కరకట్టను ఎత్తుగా నిర్మిస్తే సమస్య పరిష్కారమవుతుంది. ఏదులాపురంలో భారీ వర్షాలకు మున్నేరు నది ఉప్పొంగి రాజీవ్ గృహకల్ప, నాలుగోతరగతి ఉద్యోగుల కాలనీ, నాయుడుపేట, జలగంనగర్, ఆర్టీసీకాలనీ, సాయిప్రభాత్‌నగర్, కేవీఆర్‌నగర్–2ను ముంచెత్తుతోంది. ఈ వేసవిలోగా పనులు పూర్తిచేస్తే ముంపు ఇక్కట్లు తీరుతాయి.

# కరుగుతున్న గుట్టలు..!

మహబూబాబాద్ : జిల్లాలో అక్రమంగా పలుచోట్ల మట్టి దందా జోరుగా సాగుతోంది. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న గుట్టలను తవ్వి అక్రమ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జేసీబీల సహాయంతో గుట్టలను తవ్వడంతో పాటు ఎస్సారెస్పీ కాలువకు సంబంధించిన మట్టి, చెరువుల్లో అక్రమంగా బావులను తవ్వి తరలిస్తూ రియల్ ఎస్టేట్ భూముల్లో పోస్తూ లాభాలు గడిస్తున్నారు. జిల్లా కేంద్రం చుట్టూ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ ఆధీనంలో ఉన్న గుట్టలను ఖాళీ చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా బహిరంగంగానే మట్టి అక్రమ దందా సాగుతున్నా సంబంధిత అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటంతో ఈ దందా వ్యాపారులకు అడ్డు అదుపు లేకుండా పోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేసి మట్టి అక్రమ దందాను అరికట్టాల్సిన అవసరం ఉందని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

**సంఘటనలు కొన్ని**



మహబూబాబాద్ మండలం వీఎస్.లక్ష్మీపురం పెద్ద చెరువులో అక్రమంగా బావి తవ్వి మట్టి తరలిస్తుండటంతో స్థానికుల సమాచారం మేరకు సంబంధిత అధికారులు ఒకరిపై రూరల్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. మహబూబాబాద్ పట్టణంలోని పత్తిపాక శివారు వైద్య కళాశాల సమీపంలో ప్రభుత్వ ఆదీనంలో ఉన్న గుట్టను జేసీబి సహాయంతో మట్టి తవ్వకాలు జరిపి పట్టణంలోని స్థలాలకు తరలిస్తున్నారు. పట్టపగలే పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నా పట్టించుకునే వారు కరవయ్యారు. పట్టణ పరిధిలోని బేతోలు శివారులో ఉన్న మట్టి దిమ్మెను తవ్వి వ్యాపారం చేస్తున్నారు. మండలంలోని జంగిలిగొండ క్రాస్ రోడ్డు సమీపంలోని గుట్టలను తవ్వి రాత్రి సమయంలో గుట్టుచప్పుడు కాకుండా మట్టిని తరలిస్తున్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే పనులకు మట్టిని వినియోగిస్తున్న క్రమంలో జేసీబీ వాహనదారులు ఇదే అదును చేసుకొని దందా సాగిస్తున్నారు.

# జేఎన్‌టీయూకి ప్రత్యేక జర్నల్



హైదరాబాద్ : జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం విదేశీ వర్సిటీల తరహాలో ప్రత్యేకంగా జర్నల్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకురానుంది. ఇంజినీరింగ్ విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు ఇది వేదికగా మారనుంది. ఇందులో ప్రథమ సంవత్సరం నుంచి నాలుగో సంవత్సరం చదువుకుంటున్న విద్యార్థుల్లో ఎవరైనా సరే వారికి వచ్చిన ఆలోచనలను, చేయాలనుకున్న పరిశోధనలను ఆచార్యులకు తెలిపితే... వారు సహకారమందించి వాటిని పరిశోధన పత్రాలుగా రూపొందించనున్నారు. అనంతరం జేఎన్‌టీయూ జర్నల్‌లో ప్రచురించనున్నారు. ఈ పత్రికను ఆన్‌లైన్ ఎడిషన్‌గానూ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడంతో ప్రపంచవ్యాప్తంగా విద్యార్థులు, ఆచార్యులు, పరిశోధకులు చదివేందుకు అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. అవసరమైతే విదేశాల్లో ఉంటున్న పూర్వ విద్యార్థులకు రచనలు చేసే అవకాశం కల్పించనున్నారు.

**ప్రజలకు ప్రయోజనం కలిగించే ఆవిష్కరణలు**

ఇంజినీరింగ్ విద్యార్థులు, ఆచార్యులు చేస్తున్న పరిశోధనలు, ఆవిష్కరణలు ప్రజలకు, సమాజానికి ప్రయోజనం కలిగించనున్నాయి. ఈ పరిశోధనల ద్వారా భవిష్యత్తులో జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు అవకాశాలున్నాయన్న భావనతో జర్నల్‌ను తీసుకురావాలని జేఎన్‌టీయూ ఉన్నతాధికారులు నిర్ణయించారు. పర్యావరణానికి మేలు కలిగించే పరిశోధనలు, జలవనరుల సంరక్షణ.. వైద్య నిపుణులకు అవసరమైన పరికరాల రూపకల్పన వ్యర్థాలతో ఇంధనం తయారీ. మరింత ఆధునికీకరించిన ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్.. రహదారులపై ట్రాఫిక్ నియంత్రణ.. మెట్రోరైల్.. కార్లు, బస్సుల్లో అధునాతన సాంకేతిక వ్యవస్థలకు సాఫ్ట్‌వేర్ రూపకల్పన వంటివాటిపై పరిశోధనలు అందరికీ తెలియనున్నాయి.

**అంకుర సంస్థల ఉత్పత్తుల వివరాలు..**

జేఎన్‌టీయూ విద్యార్థులు, బహుళజాతి సంస్థలు సంయుక్తంగా స్థాపించిన అంకుర సంస్థల ఉత్పత్తుల వివరాలను ఈ జర్నల్‌లో అధికారులు ప్రచురించనున్నారు. ఆటోమొబైల్ పరికరాలు, సాఫ్ట్‌వేర్‌లు.. ప్రాణాధార మందుల తయారీ, నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేస్తున్న అంకుర సంస్థల విజయాలను ఇందులో పొందుపరచనున్నారు. ఆయా సంస్థల ప్రస్థానం నుంచి ఇప్పటి వరకూ రూపొందించిన ఉత్పత్తులు పరికరాలను ఈ జర్నల్‌లో ప్రచురించడం ద్వారా జేఎన్‌టీయూ ఆచార్యులు, వర్సిటీతో బహుళజాతి సంస్థలు.. ప్రభుత్వరంగ సంస్థలు వాటిని చదివి స్పందించి ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశాలున్నాయి. వీటికి అదనంగా అంకుర సంస్థలు తయారు చేసిన వస్తువులు, పరికరాలకు మరింత సాంకేతిక పరిజ్ఞానాన్ని నిపుణులు వాటికి అందించనున్నారు. అంకుర సంస్థలపై జర్నల్‌లో ప్రచురితమయ్యే అంశాలు వేటికవే భిన్నంగా ఉండేలా.. ప్రస్తుత, భవిష్యత్ పురోగతి, వారు రూపొందిస్తున్న వస్తువులు ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తే ఒనగూరే ప్రయోజనాలు వివరంగా ఉంటాయని జేఎన్‌టీయూ అధికారులు తెలిపారు.

# పుర పట్టు.. గురికొట్టు



అశ్వారావుపేట : ప్రతి పట్టణానికి దాని అభివృద్ధిలో కొన్ని ప్రాంతాలు గుండెకాయలా పనిచేస్తుంటాయి. నీళ్లున్న చోటే ఫలాలు అన్నట్టు వాటిని ఆధారంగానే చేసుకునే పట్టణవాసులు స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుని వర్తక, వ్యాపారాలు, పరిశ్రమలు విస్తరిస్తుంటారు. జనాభా, ఓటర్లు అధికంగా ఉండే ఆ ప్రాంతాలు ఎన్నికల వేళ గెలుపోటముల్ని నిర్ణయించే క్రియాశీల శక్తులుగా మారుతుంటా్. ఫలితంగా అన్ని పార్టీల నాయకులూ వాటిని ప్రత్యేక దృష్టితో చూస్తుంటారు. సమీప గ్రామపంచాయతీలను కలుపుకొని ఉభయ జిల్లాల్లో కొత్తగా మూడు మున్సిపాలిటీలూ ఏర్పాటయ్యాయి. పురపాలక అధ్యక్ష, ఉపాధ్యక్ష నియామకాల్లో క్రియాశీలక పాత్ర పోషించే ప్రాంతాలు వాటిల్లోనూ ఉన్నాయి. ఆ విశేషాల సమాహారమే ఈ కథనం..

వ్యవసాయ సంబంధ పరిశ్రమలు అధికంగా ఉండే కల్లూరు పురపాలికలో ఏడు విలీన గ్రామాలున్నాయి. పట్టణ పొడవూ ఎక్కువే. అయినా ఇక్కడ నాలుగు ప్రాంతాల్లోని ఓటర్లే క్రియాశీలకం కానున్నారు. ఇక్కడే మూడింట రెండు వంతుల వార్డులు విస్తరించాయి.

ఎందుకిలా?పురపాలకంలో మొత్తం ఓట్లు 18,866 ఉండగా ఈ ప్రాంతాల్లోనే సుమారు 5600 ఓట్లు ఉండటం విశేషం. అంటే 30 శాతం అన్నమాట.

అంబేడ్కర్ నగర్, శాంతినగర్ తొలి నాళ్లలో వృద్ధి చెందగా అనంతర కాలంలో మధిర రోడ్డులో వర్తక వ్యాపారాలు అధికం కావటంతో దాన్ని ఆనుకుని నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. నాలుగుచోట్లా నాయకులు ప్రత్యేక ప్రచారాలు నిర్వహిస్తున్నారు.

మొత్తం వార్డులు: 20

ప్రధాన ప్రాంతాలు: అంబేద్కర్ నగర్– విద్యానగర్, శాంతినగర్, మధిర రోడ్డు

అంబేద్కర్– విద్యానగర్ కాలనీ: 04

ఏఏ వార్డులు: 2, 3, 16, 17

శాంతినగర్, మధిరరోడ్డు: 03

ఏఏ వార్డులు: 5, 18, 19

ఏదులాపురం

ఉభయ జిల్లాల్లోనే విస్తీర్ణ పరంగా అతి పెద్ద మున్సిపాలిటీ ఏదులాపురం. ఇంత పెద్ద పట్టణంలో పెద్దతండా, ఏదులాపురం పరిధిలోని వార్డులే మున్సిపల్ పీఠం కైవసం చేసుకోవడంలో క్రియాశీలక పాత్ర పోషించనున్నాయి. 32 వార్డుల్లో వీటి పరిధిలోనే 15 ఉండటం విశేషం.

ప్రాధాన్యం ఏంటి?

సహజంగా పెద్ద పంచాయతీలు కావడం.. వేగంగా స్థిరాస్తి వ్యాపారం జరిగి, నిర్మాణాలు ఊపందుకోవటంతో జనాభా వేగంగా విస్తరించింది. నగరానికి ఆనుకొని ఉన్న వీటి పరిధిలో గ్రానైట్, ఇతర పరిశ్రమల నిర్వాహకులు స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. వేర్వేరు ప్రాంతాల్లో ఉద్యోగం చేసే ప్రభుత్వ ఉద్యోగులు ఇక్కడే స్థిరపడ్డారు.

వార్డులు: 32

ప్రధాన ప్రాంతాలు: పెద్దతండా, ఏదులాపురం పూర్వ పంచాయతీలు.

పెద్దతండా పరిధిలో వార్డులు: 08

ఏవేవి?: 2, 3, 4, 5, 6, 7 (కొంతభాగం), 25, 26.

ముఖ్య కాలనీలు: నాయుడుపేట, రాజీవ్ గృహకల్ప కాలనీ, నాలుగో తరగతి కాలనీ, సాయిప్రభాత్ నగర్, జలగంనగర్, కరుణగిరి

ఏదులాపురం పరిధిలో..: 07

ఏమేంటి?: 24, 28, 27 (కొంతభాగం), 29, 30, 31, 32

ముఖ్య కాలనీలు: వరంగల్ క్రాస్‌రోడ్డు, శ్రీరామ్‌నగర్, ఏదులాపురం, ఆటోనగర్

అశ్వారావుపేట

పేరాయిగూడెం, గుర్రాలచెరువు, అశ్వారావుపేట పంచాయతీలు కలిసి అశ్వారావుపేట మున్సిపాలిటీ ఆవిర్భవించింది. పట్టణంలో ఖరీదైన ప్రాంతం భద్రాచలం మార్గం. ఆరు వార్డులతో మిళితమై ఉన్న ఈ మార్గంలోనే వర్తక, వాణిజ్య కార్యకలాపాలు సాగుతాయి.

దారి పొడవునా...

సుమారు రెండు కిలోమీటర్లు పొడవు ఉన్న భద్రాచలం మార్గం అన్ని రకాల వ్యాపార, వాణిజ్య కూడలిగా ఉంది.

వస్త్ర దుకాణాలు, హోల్‌సేల్ దుకాణాలు, జీడిగింజల కొనుగోలు కేంద్రం, వైద్యశాలలు, బంగారు నగల దుకాణాలు, వాహన షోరూంలు అన్నీ ఈ దారిలోనే ఉంటాయి.

ఈ ఏడాదే రహదారి విస్తరణ, సెంటర్ డివైడర్, సెంటర్ లైటింగ్ పనులు కొనసాగుతున్నాయి. నాన్‌ఏజెన్సీలో భాగమైన ఈ ప్రాంతంలో స్థలం విలువ కూడా ఎక్కువే.

మొత్తం వార్డులు: 22

భద్రాచలం రోడ్డు పరిధిలో వార్డులు: 06

ఏఏ వార్డులు: 13, 14, 15, 16, 17, 18

ముఖ్య కాలనీలు: గౌడబజారు, షిర్డీసాయినగర్, పాత ఆంధ్రాబ్యాంకు, దండాబత్తులవారి వీధి, బస్టాండ్ రోడ్డు,

# లంక భూమిలో అదే ఆనవాయితీ..!

మణుగూరు : మణుగూరు–ఏటూరునాగారం ప్రధాన రహదారిపై చిక్కుడుగుంట వద్ద వేసవి కాలం వచ్చిందంటే చాలు పుచ్చకాయలు వాహనదారులను ఆకట్టుకుంటాయి. ప్రధాన రహదారి పక్కనే పదుల సంఖ్యలో గుడారాలు వేసి పుచ్చకాయలను విక్రయిస్తుంటారు. మణుగూరు మండల పరిధిలోని గోదావరి లంక ప్రాంతాల్లో కొండాయిగూడెం నుంచి చినరావిగూడెం వరకు సుమారు 300 ఎకరాల్లో ప్రతి సంవత్సరం సమీప గ్రామాలకు చెందిన రైతులు పుచ్చపంట సాగు చేస్తున్నారు. ప్రతి ఏడాది దసరా పండగ పూర్తయిన వెంటనే లంకలో సొంత పొలాలతో పాటు ఇతరులకు చెందిన భూములను కౌలుకు తీసుకొని మూడు నెలల పాటు పంట సాగులో రైతులు నిమగ్నమవుతారు. **ఇతర రాష్ట్రాలకు ఎగుమతి..:** సాగు అనంతరం ఎకరాకు సగటున 10–12 టన్నుల దిగుబడి వస్తుంది. ఒక్కో పుచ్చకాయ సైజు సుమారు 20 కిలోలు ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్లో టన్ను ధర రూ.10వేల నుంచి రూ.14వేల వరకు పలుకుతోంది. ఇక్కడ పండిన పుచ్చకాయలను తెలుగు రాష్ట్రాలతో పాటు కేరళ, తమిళనాడులోని వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. లంక ప్రాంతాలకు చెందిన సుమారు 200 కుటుంబాలకు యాసంగి సమయంలో ఈ పుచ్చపంటనే జీవనోపాధిగా మారుతోంది. విత్తనాల దశ నుంచి పంట సాగు చేయటం, ఎగుమతి, దిగుమతితో కలిపి దాదాపు ఆరు నెలల పాటు రైతులతో పాటు వ్యవసాయ కూలీలకు పని లభిస్తుంది. మణుగూరు, అశ్వాపురం, పినపాక మండలాల్లోని ప్రజలు ఇక్కడికి వచ్చి పుచ్చకాయలను కొనుగోలు చేస్తుంటారు. పుచ్చపంట దిగుబడి తరువాత అన్ని ఖర్చులు పోగా సుమారు రూ.2 లక్షల వరకు ఆదాయం లభిస్తుంది. చినరావిగూడెం కంటే కొండాయిగూడెం లంక భూముల్లో ఎక్కువ ఎకరాల్లో పుచ్చపంటను సాగు చేస్తుంటారు.

**కష్టానికి తగిన లాభం..**చినరావిగూడెం లంక ప్రాంతంలో గత మూడు నెలల నుంచి పుచ్చపంటను సాగుచేస్తున్నాం. ఇప్పటివే వచ్చిన దిగుబడు లను వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తు న్నాం. బేరగాళ్లకు కూడా విక్రయిస్తుంటాం. నాలుగు నెలల పాటు పండించిన పంటకు, చేసిన కష్టానికి తగిన లాభం వస్తుంది.
సారమ్మ, రైతు, చినరావిగూడెం

# శివారు కాలనీల్లో కష్టాలు.. పరిష్కారం ఇంకెన్నాళ్లు!

భూపాలపల్లి :పట్టణంలోని పలు శివారు కాలనీల్లో వేలాది మంది నివాసం ఉంటున్నారు. సీఆర్‌నగర్, బీసీ కాలనీ, వెంగల్‌రావు కాలనీ, వెంకటేశ్వర కాలనీ, జీఎంఆర్ గార్డెన్ ఏరియా, మంజూర్‌నగర్, భాస్కర్‌గడ్డ తదితర ప్రాంతాల్లో శివారు కాలనీలు ఉన్నాయి. ఈ కాలనీలు ఎన్నోఏళ్ల కింద ఏర్పడ్డాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు మారుతున్నా.. సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని కాలనీ వాసుల నుంచి నివేదన వ్యక్తమవుతోంది. భూపాలపల్లి పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. పట్టణ విస్తరణలో భాగంగా శివారులో అనేక కాలనీలు వెలుస్తున్నాయి. అయితే ఎన్నోఏళ్లుగా శివారు కాలనీలు, గ్రామాల్లో మౌలిక వసతులు కరవయ్యాయి. అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో ఆయా కాలనీవాసులు నిత్యం ఇక్కట్లు పడాల్సి వస్తోంది.

**అధ్వానం.. అంతర్గత రహదారులు**

పట్టణంలోని సీఆర్‌నగర్, బాంబులగడ్డ, బీసీ కాలనీ, వెంగల్‌రావుకాలనీ, వెంకటేశ్వరకాలనీల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఈ కాలనీల్లో సీసీ రహదారులు లేకపోవడంతో చినుకు పడితే చిత్తడిగా మారుతున్నాయి. పక్కా కాల్వలు లేక మురుగునీరు రోడ్లపైనే పారుతూ.. ఖాళీ స్థలాల్లోకి చేరుతుంది. దీంతో భరించలేని దుర్వాసనతో పాటు దోమలు వ్యాప్తి చెందుతూ.. స్థానికులు రోగాలపాలవుతున్నారు. అనేక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.



పలు కాలనీల్లో విద్యుత్తు స్తంభాలకు వీధిదీపాలు సరిపడా లేక ఇబ్బందులు తప్పడం లేదు.

శివారు కాలనీల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని భూపాలపల్లి మున్సిపాలిటీ కమిషనర్ జోనా తెలిపారు. ఇప్పటికే పలు కాలనీల్లో అభివృద్ధి పనులు ప్రారంభించాం. మిగిలిన వాటికి అవసరమయ్యే నిధుల విడుదల కోసం ప్రతిపాదనలు త్వరలోనే ప్రభుత్వానికి నివేదిస్తాం.

**తాగునీటి సౌకర్యం లేదు..**

– స్వామి, సీఆర్‌నగర్‌కాలనీ

శివారు కాలనీల్లో సీసీ రహదారులు, పక్క మురుగు కాల్వల్లేక ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలంలో దారులన్నీ బురదగా మారుతున్నాయి. బయటకు వెళ్లాలంటే ఎన్నో ప్రయాసలు పడాల్సి వస్తోంది. పలు కాలనీల్లో తాగునీటి సౌకర్యం లేదు. కొత్తగా ఏర్పడుతున్న కాలనీల్లో మిషన్ భగీరథ పైపులైన్ ద్వారా నీటి సరఫరా చేపట్టడం లేదు. దీంతో వేసవిలో నీరు బయట కొనుక్కోవాల్సి వస్తోంది. అధికారులు స్పందిస్తేనే సమస్యలు తీరతాయి.

# ఖాళీ ప్లాట్లు.. ప్రజల పాట్లు

జనగామ : వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణాల్లో ఖాళీ స్థలాలు అపరిశుభ్రానికి ఆవాసాలుగా మారుతున్నాయి. నిర్వహణ బాధ్యతను విస్మరించిన యజమానులు, పట్టించుకోని మున్సిపల్ అధికారుల వైఖరితో జనగామలోని ఖాళీ ప్లాట్ల పక్కన నివసించేవారు ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలంలో పట్టింపునకు నోచుకోని ఈ స్థలాలు, ప్లాట్లు మురుగు నీటి మడుగులుగా మారుతున్నాయి. సీజనల్ వ్యాధులకు అడ్డాలుగా తయారవుతున్నాయి.

**చుట్టుపక్కల నివాసితుల ఇబ్బందులు**

పట్టణాల్లోని ఖాళీ స్థలాలు అస్తవ్యస్తంగా తయారైనా.. పుర పారిశుద్ధ్యానికి విఘాతం కలిగించినా అధికారులు సంబంధిత యజమానులకు నోటీసులు ఇచ్చి, ఇబ్బందులు తొలగించాలి. ఇళ్లకు పన్నులు విధించిన రీతిలో ఖాళీ స్థలాలను లెక్కించి యజమానులకు నోటీసులు ఇవ్వాల్సిన, పన్నులు వసూలు చేయాల్సిన బాధ్యత పుర అధికారులదే. జనగామ పురపాలిక పరిధిలోని 30 వార్డుల్లో 20 కొత్తగా వెలిసిన కాలనీలతోపాటు బొడ్రాయి చుట్టూ ఉన్న వీధుల్లోని ఖాళీ స్థలాలతో చుట్టుపక్కల నివాసితులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని బాలాజీనగర్, జ్యోతినగర్, జీఎంఆర్ కాలనీ, శ్రీవిల్లాస్, శ్రీనగర్, వినాయక్‌నగర్, ధర్మకంచ, అంబేద్కర్‌నగర్, అంబబావి ఏరియా, బస్‌డిపో వెనుక, గిర్నిగడ్డ, గుండ్లగడ్డ, పురపాలికలో కొత్తగా విలీన ప్రాంతాల్లోను ఖాళీ స్థలాల సమస్య తీవ్రంగా ఉంది.

**యజమానుల నిర్లక్ష్యం**

యజమానులు స్థలాలను వదిలి వేరే చోట నివసించడం, పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి ఎదురవుతోంది. వీటిల్లో పిచ్చిమొక్కలు, ముళ్ల చెట్లు, మురుగునీరు, దోమలు, ఈగలతోపాటు కోతులు, కుక్కలు, పందులకు ఆవాసంగా మారుతున్నాయి. వీటి కారణంగానే పక్కనుండే గృహాల్లోకి పాములు, తేళ్లు వస్తున్నాయని సమీపవాసులు అసహనం చెందుతున్నారు. కాలానుగుణ వ్యాధులు, విషజ్వరాలు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పురపాలిక అధికారులు ప్రచారం చేస్తున్నారే గాని, నిబంధనల అమలుపై దృష్టి సారించడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**స్టేషన్‌ఘన్‌పూర్‌లోనూ..**

ఏడాది క్రితం స్టేషన్‌ఘన్‌పూర్ పురపాలికగా మారినప్పటికీ ఖాళీ స్థలాలతో ఏర్పడే సమస్యలను పుర అధికారులు పట్టించుకోవడం లేదు. పట్టణంలోని ఎస్సీకాలనీ, రైల్వేకాలనీ, ప్రభుత్వ ఆసుపత్రి, బస్టాండ్ ప్రహరీ వెనుక, శివునిపల్లి, చాగల్లు పరిధిలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో 13 చోట్ల ఖాళీ ప్లాట్లు అపరిశుభ్రంగా ఉన్నాయి. మున్సిపల్ అధికారులు వీటిని గుర్తించి తగు చర్యలు తీసుకోవడంలేదు. ఆదాయం వచ్చే అవకాశం ఉన్నా పట్టించుకోకపోవడం గమనార్హం.

**ఇవీ నిబంధనలు..**

ఖాళీ ప్లాట్లు అపరిశుభ్రంగా, వ్యాధులకు ఆవాసాలుగా మారినప్పుడు నిబంధనల మేరకు పుర అధికారులు యజమానులకు నోటీసు ఇచ్చి శుభ్రం చేయించాలి. లేదంటే పుర ఆధ్వర్యంలో శుభ్రపర్చి, అయ్యే ఖర్చును వారి నుంచి వసూలు చేయాలి. నోటీసులకు స్పందించని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చు. పట్టణంలో 2 వేల వరకు ఖాళీ ప్లాట్లు, ఖాళీ స్థలాలకు మ్యుటేషన్ జరిగేలా చర్యలు తీసుకోవాలి.

# పాత రిక్షా.. కొత్త జీవితం

అమీర్‌పేట : వరంగల్ జిల్లా చేర్యాలకు చెందిన రైతు లక్ష్మణ్ వ్యవసాయంలో నష్టపోయాడు. అనారోగ్యం బారిన పడిన భార్య, ఇద్దరు చిన్నారులను తీసుకొని 2001లో నగరం బాట పట్టాడు. అమీర్‌పేటలోని ఓ ఆసుపత్రిలో భార్యను చేర్చాడు. చేతిలో డబ్బంతా అయిపోవడంతో.. ఓ పాత రిక్షా తీసుకుని అందులో కిరోసిన్ పంపుస్టౌ పెట్టుకుని చాయ్ తయారు చేసి విక్రయించాడు. స్థానికులు లక్ష్మణ్ సంచార చాయ్ బండిని ఆదరించారు. రిక్షా స్థానంలో మూడుచక్రాల మోటారు సైకిల్ ఏర్పాటు చేసుకున్నాడు. తేనీరులోని విభిన్న రకాలతో పాటు మధుమేహులకు చక్కెర లేని చాయ్ అమ్మేవారు. కొన్ని చోట్ల ఆయన బండి రాకకు స్థానికులు ఎదురుచూసేవారు. సంపాదన పెరిగి కొద్దికాలంలోనే ఆర్థిక సమస్యలు దూరమయ్యాయి.




**నిరుద్యోగులకు బాసటగా..**
తన మూడు చక్రాల మోటారు సైకిల్ చాయ్‌బండి ఆలోచన కొందరు నిరుద్యోగులకు నచ్చింది. దీంతో ఆయన్ని ఆశ్రయించారు. వారిఖర్చులతో 22 మందికి మూడు చక్రాల మోటారు సైకిళ్లు తయారు చేయించాడు. లక్ష్మణ్ రోజూ తెల్లవారుజాము 3 గంటలకే అమీర్‌పేటలోని మైత్రీవనం వద్ద సంచార చాయ్ వ్యాపారం ప్రారంభిస్తారు. ఎస్సార్‌నగర్, ఈఎస్‌ఐ, ఎర్రగడ్డ, సనత్‌నగర్ ప్రాంతాలు తిరుగుతూ ఉదయం 9 గంటలకే వ్యాపారం మూసేస్తాడు. అప్పుడప్పుడు సారథి స్టూడియోలో సినిమా షూటింగ్‌లు జరిగితే వారికి లక్ష్మణ్ చాయ్ ఇస్తుంటాడు. పొట్టకూటి కోసం నగరం బాట పట్టిన లక్ష్మణ్ ఆలోచన.. ఆదర్శంగా మారడం గమనార్హం.

# తపాలాశాఖలో స్మార్ట్ డెలివరీ..!

హైదరాబాద్ : తపాలాశాఖ డెలివరీ సేవలు రోజురోజుకు కొంత పుంతలు తొక్కుతున్నాయి. గతంలో డెలివరీకి రెండు, మూడు రోజులు వేచి చూడాల్సి వచ్చేది. అందుకోసం ఇటీవల ఒక్కరోజులో డెలివరీ అంటూ డాక్ సేవను తీసుకువచ్చారు. ప్రస్తుతం 24 గంటలు పార్సిల్, ఉత్తరాలను తీసుకునేలా త్వరలో డిజిటల్‌లాకర్‌ను ఏర్పాటు చేయనున్నారు. తగ్గనున్న నిరీక్షణ.. ఇప్పటివరకు డెలివరీ ఇచ్చే సమయంలో సంబంధిత యజమాని లేకపోతే తపాలా సిబ్బంది వద్ద రోజుల పాటు ఉత్తరాలు, పార్సిల్లు ఉంచాల్సి వచ్చేది. ప్రస్తుతం వాటిని పోస్టాఫీసులోని డిజిటల్ లాకర్‌లో ఉంచుతారు. రాత్రి వెళ్లినా సంబంధిత పార్సిల్ లేదా ఉత్తరానికి సంబంధించిన నంబరును లాకర్ వద్ద స్క్రీన్‌పై టైప్ చేసి క్లిక్‌చేస్తే తెరుచుకుంటుంది. దీంతో గంటల



కొద్దీ ఎదురు చూడాల్సిన సమయం తగ్గినట్లయింది. పోస్టాఫీస్ పనివేళతో సంబంధం లేకుండా ఎప్పుడైనా తీసుకోవచ్చు.

**ప్రజావసరాలకు అనుగుణంగా...**
ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఆటోమేటెడ్ డిజిటల్ పార్సిల్ లాకర్లను త్వరలో హైదరాబాద్‌లోని జీపీవోలో ఏర్పాటు చేస్తున్నాం. దీని వల్ల తపాలా సేవల కోసం గంటలపాటు ఎదురుచూడాల్సిన అవసరం లేదు. ఇది ఎంతో ఉపయోగకరం. వై.ప్రసాద్, చీఫ్ పోస్ట్‌మాస్టర్, జీపీవో హైదరాబాద్

# తెవివిలో అభివృద్ధి పనులకు అడుగులు

తెలంగాణ విశ్వవిద్యాలయంలో రూ.91.6 కోట్లతో అభివృద్ధి పనులకు అడుగులు పడనున్నాయి. నేడు జిల్లాకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బర్దీపూర్ శివారులోని కేశాపూర్ రోడ్డు మార్గంలోని సభ వేదిక వద్దే యూనివర్సిటీ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

**సైన్స్ కళాశాల భవనం..**
రాష్ట్ర ప్రభుత్వ డెవలప్‌మెంట్ గ్రాంటు, రూసా, ట్రైబల్ వెల్ఫేర్, కొంత యూనివర్సిటీ అంతర్గత నిధులతో కలిపి తెవివిలో భవనాల నిర్మాణం చేపట్టనున్నారు. రూ.18.38 కోట్లతో కొత్తగా నిర్మించిన సైన్స్ కళాశాల భవనాన్ని సీఎం ప్రారంభిస్తారు. రూ.8.6 కోట్లతో సీసీ రోడ్లు, ఫుట్‌పాత్, రూ.1.36 కోట్లతో ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టు, రూ.26 లక్షలతో బాస్కెట్‌బాల్ కోర్టు, కంప్యూటర్ సైన్స్ భవనంపై రూ.10 కోట్లతో పైఅంతస్తు, రూ.17 కోట్లతో ఆడిటోరియం, రూ.16 కోట్లతో నూతన పరిపాలన భవనం, రూ.20 కోట్లతో నిర్మించే ట్రైబల్ వెల్ఫేర్ బాలబాలికల హాస్టళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేస్తారు. ఈ అభివృద్ధి పనుల శంకుస్థాపన కోసం వర్సిటీ అధికారులు, విద్యార్థులు ఎప్పటి నుంచో ఎదురుచూస్తుండగా.. శుక్రవారం సీఎం శంకుస్థాపనలు చేస్తుండడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**సంతోషంగా ఉంది..** – ఆచార్య యాదగిరిరావు, వీసీ తెవివి
తెవివిలో ఇంత భారీ వ్యయంతో భవనాల నిర్మాణాలు చేపట్టడం ఆనందంగా ఉంది. అడగగానే ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సహకరించింది. ఇందుకు ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధుల సహకారం ఎనలేనిది.

# 'పట్టాలు' తప్పుతున్న ప్రాణాలు



హైదరాబాద్ : "సికింద్రాబాద్ రైల్వే పోలీసు పరిధిలో పట్టాలపై వివిధ కారణాలతో ఏటా 1200 నుంచి 1300 మంది మృత్యువాత పడుతున్నారు. వారిలో అధిక శాతం ప్రయాణికులు నిర్లక్ష్యంతో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. మిగిలిన వారు వివిధ కారణాలతో బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. 1-2 శాతం మంది అనుమానాస్పద స్థితిలో మృతిచెందుతున్నారు." రక్షణ చర్యలు చేపట్టడంలో యంత్రాంగం నిర్లక్ష్యం ప్రయాణికుల ప్రాణాలు బలితీసుకుంటున్నాయనే విమర్శలు ఉన్నాయి. రైల్వేస్టేషన్‌కు కిలోమీటరు దూరం వరకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయటం ద్వారా మరణాలకు అడ్డుకట్ట వేయవచ్చని సూచిస్తున్నారు.

**మూల మలుపులు.. దగ్గరి మార్గాలు**రైల్వేస్టేషన్ సమీపంలోకి రావటానికి ముందు.. అప్పటికే ఆయా ప్లాట్‌ఫామ్‌లపై మరో రైలు ఉందనే సమాచారంతో రైళ్లను దూరంగా నిలుపుతుంటారు. ఆ సమయంలో రైలుదిగిన ప్రయాణికులు బయటకు వెళ్లేందుకు పట్టాలు దాటుతుంటారు. కొందరు సెల్‌ఫోన్‌లో మాట్లాడు తూ ఏమరుపాటుగా ఉంటారు. రైలు కూత వినగానే గాబరాపడతారు ఇంకొందరు. మూల మలుపుల్లో బండి వచ్చేంత వరకూ గమనించరు. అకస్మాత్తుగా రైలు ఎదురుపడగానే ఆందోళనకు గురవుతారు. ఎటూపాలుపోని పరిస్థితిలో అక్కడే నిలబడి మృత్యువాత పడుతున్నారు. సాహసోపేతమైన రీల్స్ చేసి అందర్నీ ఆకట్టుకోవాలనే ఆలోచనతో ప్రమాదకరమైన ఫీట్లు చేస్తూ కిందపడుతున్నారు.

**ఇక్కడే అధికశాతం ప్రమాదాలు**
అమీర్‌పేట నేచర్ క్యూర్ హాస్పిటల్, కూకట్‌పల్లి, మియాపూర్, చందానగర్, హాఫీజ్‌పేట్ ప్రాంతాల్లో కాలిబాట మార్గాలు ఉండటంతో పట్టాలు దాటుతున్నారు. సికింద్రాబాద్ పరిధిలో ఘట్‌కేసర్ మాధవరెడ్డి బ్రిడ్జి, ఎన్‌ఎఫ్‌సీ గేటు, లాలాపేట్, మౌలాలి, సీతాఫల్‌మండి, మేడ్చల్‌లో అధికంగా ప్రమాదాలు నమోదవుతున్నాయి.

**స్వీయ జాగ్రత్తలు పాటిస్తే చాలు**రైలు ప్రయాణంలో స్వీయ జాగ్రత్తలతో సురక్షితంగా గమ్యం చేరవచ్చు. రీల్స్, సెల్ఫీ మోజులో కొందరు అజాగ్రత్తగా వ్యవహరించి ప్రమాదాల బారినపడుతున్నారు. దగ్గర దారిలో రైల్వేస్టేషన్ బయటకు వెళ్లాలనే తొందరలో మరో వైపు నుంచి వచ్చే రైళ్లను గమనించలేకపోతు న్నారు. జావేద్, జీఆర్పీ డీఎస్పీ

# 'కొర్రీ'యన్ డ్రామాలు!



హైదరాబాద్ : "నగరానికి చెందిన ఓ మహిళ పిల్లల వైద్యురాలిని కలిసి బోరుమన్నారు. సముదాయించి ధైర్యం చెప్పిన తర్వాత ఆరా తీయడంతో అసలు సంగతి తెలుసుకొని డాక్టర్ అవాక్కయ్యారు. ఏడో తరగతి చదువుతున్న తమ కుమార్తె కొరియన్ డ్రామాలు, పాప్ చూస్తూ తాను కొరియన్‌లా ప్రవర్తిస్తోందని, భవిష్యత్తులో కొరియన్ వ్యక్తినే పెళ్లాడాతానని అంటోందని కన్నీరుమున్నీరైంది. తల్లి బాధను విన్న వైద్యురాలు.. మెల్లగా బాలికను సైతం తల్లితో సహా క్లినిక్‌కు రప్పించి.. మాటలు కలిపి కొన్ని రోజులపాటు కౌన్సెలింగ్ ఇచ్చారు. బాలిక క్రమంగా ఆ ఫాంటసీ నుంచి బయటపడింది."

తాజాగా ఉత్తరప్రదేశ్ గాజియాబాద్‌లోని ముగ్గురు బాలికలు కొరియన్‌కు చెందిన లవ్‌గేమ్‌కు బానిసలు మారి, తల్లిదండ్రులు వారించడంతో ఆత్మహత్యకు పాల్పడటం తెలిసిందే. గేమ్‌లో భాగంగా ఆత్మహత్య చివరి టాస్క్‌గా ఉండటంతో అభం శుభం తెలియని ఆ బాలికలు అదే నిజమని భావించి.. తొమ్మిది అంతస్తుల మేడపై నుంచి కిందకు దూకి మృతి చెందడం తీవ్రంగా కలిచివేసింది.

**10 నుంచి 16 ఏళ్లలోపు వారే ఎక్కువ**
10 నుంచి 16 ఏళ్లలోపు బాలలు ఎక్కువగా వాటికి ఆకర్షితులు అవుతున్నారు. స్కూళ్లకు వెళ్లినా సరే...అక్కడ చదువుపై సరిగా దృష్టి పెట్టడం లేదు. పిల్లల మధ్య కెపాప్, కెడ్రామాల గురించి ఎక్కువ చర్చ నడుస్తోంది. డ్రామాలను బాలికలు ఎక్కువగా ఇష్టపడుతున్నారని నగరానికి చెందిన ఓ చిన్నపిల్లల వైద్యుడు తెలిపారు. వాటిలో రొమాన్స్, కామెడి, ట్విస్ట్‌లు, కట్టిపడేసే కథనాల వల్ల ఇవి ఎక్కువగా ఆకర్షిస్తున్నాయి. వీటిలో నటించే హీరో హీరోయిన్ల ఆకర్షణీయంగా ఉండటంతో వాళ్లలా ఉండాలని తపిస్తున్నారు.

**ఫాంటసీ లోకంలో మునిగి తేలుతూ...**
కొరియన్ డ్రామాలు, ఆన్‌లైన్ గేమ్స్ పిల్లల్లో ఒక ఫాంటసీ ప్రపంచాన్ని సృష్టిస్తున్నాయి. చివరికి అవి లేకపోతే బతుకే లేదన్న వరకు తీసుకొస్తున్నాయి. ఈ పరిస్థితి పిల్లల్లో శారీరక, మానసిక ఆరోగ్యాలను ప్రతికూలంగా ప్రభావితం చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. కుంగుబాటు, ఆందోళన లాంటివి పెరుగుతాయని వైద్యులు చెబుతున్నారు. డ్రామాల్లోని పాత్రలతో పోల్చుకొని.. అలా లేకపోవడం వల్ల నిరాశ, నిస్పృహలకు లోనవుతున్నారు.


**క్రమేపీ మార్పు తేవాలి**తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. స్క్రీన్ టైం పరిమితం చేయాలి. పాఠశాల నుంచి వచ్చిన తర్వాత టీవీ, ఫోన్‌కు అతుక్కుపోకుండా.. ఆటలు, మ్యూజిక్, చిత్రలేఖనం లాంటి తరగతులకు పంపాలి. ఫాంటసీ లోకం కాకుండా.. వాస్తవ పరిస్థితి వివరించి చెప్పాలి. ఒకేసారి కాకుండా క్రమేపీ వాటి నుంచి దూరం చేయాలి. డాక్టర్ కృష్ణసాహితి, కన్సల్టెంట్, సైకియాట్రిస్ట్

# విద్యుత్తు కనెక్షన్లు సులభం.. భారం స్వల్పం

హైదరాబాద్: విద్యుత్తు కనెక్షన్ల జారీలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు విద్యుత్తు పంపిణీ సంస్థ నిబంధనలు కఠినతరం చేసింది. నిబంధనల ప్రకారం ఉన్న దరఖాస్తులకు సులభతరంగా కనెక్షన్ల జారీకి చర్యలు చేపట్టింది. వినియోగదారుల సేవా కేంద్రాల్లో నుంచి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

**తాజా మార్పులతో ప్రయోజనాలు**
కిలోమీటరు లోపు కనెక్షన్లు ఎక్కడైనా లోడ్ ఆధారంగా ఛార్జీలు చెల్లించేలా నిబంధనల్లో మార్పులు చేశారు. 20 కిలోవాట్ల లోపు ఇదివరకు మాదిరే డెవలప్‌మెంట్ ఛార్జీలతో పాటూ కొత్తగా సర్వీస్ లైన్ ఛార్జీలను వసూలు చేస్తారు. అందరి వినియోగదారులపై భారం ఒకేలా ఉంటుందని అధికారులు అంటున్నారు. ఇదివరకు తొలుత ఎవరైనా కనెక్షన్ తీసుకుంటే విద్యుత్తు లైన్లు, స్తంభాలకు అయ్యే ఖర్చును వారే భరించాల్సి వచ్చేది. తర్వాత కనెక్షన్ తీసుకునేవారు డెవలప్‌మెంట్ ఛార్జీలు మాత్రమే చెల్లించి తీసుకునేవారు.

**వీరిపైన భారం**
గృహ విభాగం(ఎల్‌టీ1)లో విద్యుత్తు కనెక్షన్ల జారీలో కనీసం 2 కిలోవాట్లను తప్పనిసరిగా చేశారు.
ఈ ప్రకారం ఇదివరకు 2 కిలోవాట్ల కనెక్షన్ తీసుకుంటే డెవలప్‌మెంట్ ఛార్జీలు రూ.3262 చెల్లిస్తే సరిపోయేది ఇప్పుడు ఈ రుసుములతో పాటూ సర్వీస్ లైన్ ఛార్జీల్లో రూ.500 స్థిర ఛార్జీలు, కిలోవాట్‌కు రూ.600 చొప్పున రెండు కిలోవాట్లకు రూ.1200 చెల్లించాలి. అంటే



అదనంగా రూ.1700 కట్టాల్సి ఉంటుంది.
కిలోమీటర్ లోపు ఉన్నవారికి ఇది భారం. దూరంగా ఉన్నవారికి మేలు జరుగుతోంది.

**వీరికి ఊరట**
దూరంగా ఉన్న లైన్ నుంచి ఇంటికి కనెక్షన్ కావాలంటే అందుకయ్యే ఖర్చును వినియోగదారుడి నుంచి వసూలు చేసేవారు. ఇటీవల 10 కిలోవాట్ల కనెక్షన్ కోసం రూ.90వేలు అంచనా వేశారు. దీంతో పాటూ యథాతథంగా డెవలప్‌మెంట్ ఛార్జీలు రూ.16190 కట్టించుకున్నారు. కొత్త విధానంలో డెవలప్‌మెంట్ ఛార్జీలకు అదనంగా సర్వీస్ లైన్ ఛార్జీలు(స్థిర ఛార్జీ రూ.2900, కిలోవాట్‌కు రూ.1500 చొప్పున పది కిలోవాట్లకు రూ.15వేలు అంటే రూ.17900) మొత్తంగా రూ.34090 అవుతుంది. ఇలాంటి వినియోగదారులకు మాత్రం భారీ ఊరట.

# 'స్మార్ట్' గా సెట్ చేస్తున్నారు..!

కొత్తగూడెం : నగరపాలిక వార్డుల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ తరఫున సామాజిక మాధ్యమాల ప్రచారకర్తలను నియమించుకున్నారు. తమ ప్రచార సరళిని క్షణాల్లో ఓటర్లకు చేర్చేలా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేశారు. ఫొటోలు,కృత్రిమ మేధ (ఏఐ)తో రూపొందించిన వీడియోలు పోస్ట్ చేస్తూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు.
వైరా పురపాలికలో సామాజిక మాధ్యమాల జోరు ఒక్కసారిగా పెరిగింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకులతో కూడిన వీడియోలను అభ్యర్థులకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్నారు. అభ్యర్థికి చెందిన అంశాలతో కూడిన ఫొటోలు, వీడియోలను స్టేటస్‌తో పాటు ఆయా వార్డుల గ్రూపుల్లో ఎప్పటికప్పుడు పోస్ట్ చేస్తున్నారు. ఒక్కో గ్రూపులో రోజుకు పదుల సంఖ్యలో వీడియోలు, ఫొటోలు పెడుతున్నారు.
నగరపాలిక/పురపాలిక ఎన్నికల్లో స్మార్ట్ ప్రచారం జోరందుకుంది. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు సామాజిక మాధ్యమాలను విరివిగా వినియోగించుకుంటున్నారు. విభిన్న వర్గాల వారికి ఎలా చేరువ కావాలనే అంశంపై కసరత్తు చేసేందుకు ప్రత్యేక బృందాలను నియమించుకుంటున్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని నగరపాలిక/పురపాలిక ఎన్నికలు జరుగుతున్న పట్టణాల్లో 'స్మార్ట్' బృందాలు అధిక సంఖ్యలో పనిచేస్తున్నాయి.

**నయా పోకడ**
మైకుల కన్నా సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం అధికంగా



సాగుతోంది. అభ్యర్థులు వాట్సాప్, ఫేస్‌బుక్‌ను ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఉదాహరణకు 1,250 ఓట్లు కలిగిన వార్డులో ఒక అభ్యర్థి తరఫున ఐదారు గ్రూపులు ఏర్పాటు చేస్తున్నారు. బజార్లు, సామాజికవర్గాలు, యువత, మహిళలు ఇలా విభాగాల వారీగా గ్రూపులు సృష్టించి ఏ సమాచారమైనా క్షణాల్లో వారికి అందేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందుకోసం కొంతమంది అభ్యర్థులు మూడేసి, నాలుగేసి బృందాలను నియమించుకున్నారు. ఉభయ జిల్లాల్లోని నగరపాలిక/పురపాలికలన్నింటిలోనూ ఇదే ట్రెండ్ కొనసాగుతోంది. ప్రచారానికి ముఖ్యనాయకులు వచ్చినా, అభ్యర్థి కొద్దిమందితో ప్రచారం చేసినా ఆకర్షణీయంగా ఉండేలా వీడియోలను రూపొందిస్తున్నారు. తాము గెలిస్తే డివిజన్/వార్డు పరిధిలో చేపట్టే పనులతో కూడిన అంశాలను ఆకర్షణీయ వీడియోలుగా తీర్చిదిద్ది పోస్ట్ చేస్తున్నారు. స్టేటస్‌లను గంటకోసారి మార్చుతూ ప్రచార పంథాను కొత్త పుంతలు తొక్కిస్తున్నారు.

**భిన్న వాదనలు వ్యక్తమైనా..**
సెల్‌ఫోన్ పట్టుకుంటే చాలు.. వాట్సాప్ గ్రూపుల్లో వీడియోలు, ఫొటోలతో ఇబ్బందిగా మారిందనే వాదనలూ కొంతమంది ఓటర్ల నుంచి వ్యక్తమవుతున్నాయి. అయినా సామాజిక మాధ్యమాల జోరు సాగుతుండటంతో తమ వార్డులో ఏం జరుగుతోంది, తమ వర్గం వారు ప్రత్యర్థి వైపు తిరుగుతున్నారా అనే అంశాలను సరిచూసుకునేందుకు గ్రూపుల్లోని అంశాలతో మమేకం కావాల్సి వస్తోందని పలువురు చెబుతున్నారు.

# శునక, కోతుల బెడద.. తొలగదా?

'కామారెడ్డి : జిల్లాకేంద్రంలో గత నెల 25న ఓ బాలికపై కుక్క దాడి చేసి గాయపరిచింది. అదే రోజున ఆసుపత్రిలో టీకా తీసుకుంది. 28న రెండో డోసు ఇప్పించారు. ఫిబ్రవరి 1న మూడో డోసు ఇచ్చిన కాసేపటికే పాప అపస్మారకస్థితిలోకి వెళ్లి కొన్ని గంటలకే చనిపోయింది."ఆరు నెలల కిందట కామారెడ్డిలోని అశోక్‌నగర్‌లో మహిళపై కోతులు దాడి చేశాయి. కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించి హైదరాబాద్‌కు సిఫార్సు చేశారు. అదే కాలనీలో మరో ఆరుగురిపై కోతులు దాడి చేసి గాయపరిచాయి.'
ఐదేళ్లకోసారి పురపాలక ఎన్నికలొస్తున్నాయి. వార్డుల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అభ్యర్థులు చెబుతున్నా అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలను విస్మరిస్తున్నారు. పురపాలికల్లో ఎక్కడ పడితే అక్కడ కుక్కల బెడద నెలకొంది. ఇళ్ల నుంచి రోడ్లపైకి రావాలంటేనే జంకే పరిస్థితి నెలకొంది. విచ్చలవిడిగా కోతులు, కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ప్రజలపై దాడికి పాల్పడుతున్నాయి. ఎన్నికల వేళ వార్డు ప్రజలకు శునకాలు, కోతుల బెడద నియంత్రణకు కృషి చేస్తామని పలువురు హామీ ఇస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఈ సమస్య చర్చకు దారి తీసింది.



**యంత్రాంగం ఉదాసీన వైఖరి**
రోడ్ల విస్తరణలో భాగంగా జిల్లాలోని పురపాలికలకు ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో వృక్షాలను తొలగించడంతో కోతులు జనావాసాల చెంతకు చేరాయి. నిత్యం ఇళ్లలోకి వచ్చి నానా హంగామా చేస్తున్నాయి. ఇళ్లలోని సామగ్రిని ఎత్తుకెళుతున్నాయి. ఆ తర్వాత ఆరగిస్తున్నాయి. మూగజీవాలకు ఎదురు తిరిగితే దాడికి పాల్పడుతున్నాయి. ఈ క్రమంలో అనేక మంది కోతుల బెడదకు ఇళ్లకు జాలీలు చేయించుకుంటున్నారు. ఇక కుక్కల సంతతి నియంత్రణ లేక సమస్య జఠిలంగా మారింది. కామారెడ్డి జిల్లాకేంద్రంలో సంతతి నియంత్రణ కేంద్రం ఏర్పాటు చేసినా ఎప్పుడూ మూసి ఉంచుతున్నారు. ఇప్పటివరకు 750 కుక్కలకు కు.ని చేశామని చెబుతున్నా ఎక్కడ చూసినా పదుల సంఖ్యలో శునకాలు సంచరిస్తున్నాయి.

**ప్రత్యేక దృష్టి పెడితేనే..**
వార్డుల వారీగా కుక్కలను, కోతులను పట్టుకొని పట్టణాలకు దూరంగా వదిలితే ప్రజలకు భయం తొలగనుంది. ప్రత్యేక జాలీలు కలిగిన ట్రాలీ ఆటోల్లో మూగ జీవాలను పట్టుకుని తరలించాల్సిన అవసరం ఉంది. లేకుంటే వాటి సంతతి పెరిగి ప్రజలకు తీవ్ర ముప్పుగా మారే అవకాశాలున్నాయి. పాలకవర్గాలు వీటి నియంత్రణకు ప్రత్యేక బడ్జెట్ రూపకల్పన చేస్తేనే సత్ఫలితాలు ఆశించే వీలుంది.

# 'యాప్'రే.. దోమలు పరారే

హైదరాబాద్: ఆధునిక సాంకేతికతతో జీహెచ్ఎంసీ దోమల సమస్యకు సరికొత్త పరిష్కారం కనుగొంది. ప్రత్యేకంగా ఓ యాప్‌ను రూపొందించి.. జియో ఫెన్సింగ్, జీపీఎస్‌తో సత్ఫలితాలు సాధించింది. యాప్ ద్వారా దోమల నియంత్రణకు తీసుకున్న చర్యల వల్ల 2024తో పోలిస్తే 2025లో డెంగీ కేసులు 30 శాతం తగ్గాయి. కోటి జనాభా గల నగరంలో ఈ ఘనత సాధించడంపై బల్దియాకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. కొవిడ్ వంటి విపత్తులను ముందే గుర్తించేందుకు కేంద్రం అన్ని నగరాల్లో 'మెట్రోపాలిటన్ సర్వే లెన్స్ యూనిట్ (ఎంఎస్‌యూ)'లను ఏర్పాటు చేస్తోంది. దీనిపై ఇటీవల నాగ్‌పూర్‌లో జాతీయ సదస్సు జరిగింది. ఆధునిక సాంకేతికతతో కీటక జనిత వ్యాధుల కట్టడికి తీసుకున్న చర్యలు స్ఫూర్తిదాయకమంటూ సదస్సులో బల్దియా కమిషనర్ ఆర్వీ.కర్ణన్‌ను ఎంఎస్‌యు యంత్రాంగం ప్రత్యేకంగా అభినందించింది.

**సీజన్ ఇదే..**

సహజంగా దోమలు వర్షాకాలం మొదలైనప్పట్నుంచి విజృంభిస్తాయి. చలికాలంలో సమస్య కొంత తగ్గుతుంది. జనవరి నుంచి వేసవి వరకు స్వైర విహారం చేస్తాయి. డెంగీని గుర్తించకపోతే ప్రాణాలు పోవచ్చు. జీహెచ్ఎంసీ పరిధిలో ఏటా 3 వేల వరకు కేసులు నమోదవుతాయి.



2025లో సంఖ్య 2 వేలకు దిగువనే నిలిచిపోయింది.

**నిఘా.. అమలు ఇలా..** కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్నాక దోమల నియంత్రణ విభాగాన్ని కమిషనర్ ఆర్వీ.కర్ణన్ పునర్ వ్యవస్థీకరించారు. చీఫ్ ఎంటమాలజిస్టు లేకపోయినా అరకొర సీనియర్ ఎంటమాలజిస్టులు, సహాయ వైద్యాధికారులతో సత్ఫలితాలు సాధించారు. సహాయ వైద్యాధికారులను పారిశుద్ధ్య బాధ్యతల నుంచి తప్పించారు. ఆస్పత్రులు, రోగ నిర్ధారణ కేంద్రాల్లో నమోదయ్యే డెంగీ కేసులను సర్కిల్ వారీగా మొబైల్‌యాప్‌లో నమోదు చేయగానే ఆ వివరాల ఆధారంగా సహాయ వైద్యాధికారులు డెంగీ బాధితుల ఇళ్లను జియోట్యాగ్ చేసి ఆ ఇంటితోపాటు చుట్టూ వంద ఇళ్లల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయాలి. ఆ వివరాలను ఫోటోలు, వీడియోలతో యాప్‌లో అక్కడికక్కడే నమోదు చేయాలి. 'ఇలాంటి నియంత్రణ చర్యలు ఎక్కువ ఫలితాన్ని ఇచ్చాయి. కేసులు ఎక్కువ నమోదైన ప్రాంతాలను హైరిస్క్ జోన్లుగా గుర్తించాం. 24 గంటల్లోనే ఫాగింగ్, ఇళ్లలోని నీటి నిల్వలను తొలగించి దోమల మందు ను పిచికారీ చేయడం చర్యలు చేపట్టు కమిషనర్ తెలిపారు.

# గాలి.. నేల.. విషతుల్యం



హైదరాబాద్: ఈ-వ్యర్థాలు నగరానికి శాపంగా మారుతున్నాయి. ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం ఎంత పెరుగుతుందో.. అదే స్థాయిలో వ్యర్థాలూ ఉంటున్నాయి. నిర్వహణ సరిగా లేక.. చాలా పరికరాలు సాధారణ చెత్తలో కలిసిపోయి డంపింగ్‌యార్డులోని విద్యుదుత్పత్తి కేంద్రంలో బూడిదవుతున్నాయనే విమర్శలున్నాయి. ఇటీవల డంపింగ్ యార్డులోని విద్యుదుత్పత్తి కేంద్రం నుంచి సేకరించిన బూడిదలో సీసం, పలు ఇతర భార లోహాలను పీసీబీ గుర్తించడమే అందు కు నిదర్శనం. ఆ బూడిద నేలలో కలిస్తే భూమితోపాటు భూగర్భ జలాలు పాడవుతాయి. గాల్లో కలిస్తే ప్రాణవాయువు ప్రాణాంతకమవుతుంది.

**బల్దియా పిలుపునకు స్పందన కరవు..**

బల్దియా ఈ-వ్యర్థాల సేకరణ చేపట్టినా అవగాహన కల్పించక స్పందన రాలేదు. 3 రోజుల్లో 88 టన్నులే సేకరించగలిగింది.

**2017లో ఈ-వేస్ట్ విధానం..**

పెరుగుతోన్న ఈ-వ్యర్థాలను దృష్టిలో ఉంచుకుని.. గత సర్కారు 2017లో ఈ-వ్యర్థాల విధానాన్ని తీసుకొచ్చింది. దుండిగల్, పటాన్‌చెరు ప్రాంతాల్లో పలు ప్రైవేటు సంస్థలు నిర్వహణ కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నాయి. మొత్తం వ్యర్థాల్లో 75శాతం ఇళ్లలోని వస్తువులని అంచనా. విదేశాల్లో మాదిరి ఈ-వేస్ట్‌కు ప్రోత్సాహకాలు ఇవ్వాలి.

**పెరుగుతోన్న వ్యర్థాలు..**

అంచనాల ప్రకారం.. 2009లో 3,500 టన్నులు ఉత్పత్తవగా, 2017లో 33,000 టన్నులు, 2022లో 51,000 టన్నులు ఉత్పత్తయ్యాయి. ఎక్కువ చెత్త ఉత్పత్తిలో నగరం దేశంలో ఏడో స్థానంలో ఉంది. **లేదంటే సమస్య తప్పదు..**

రీసైక్లింగ్ చేయకపోతే టీవీల్లో క్యాథోడ్ రే ట్యూబ్‌ల్లోని లెడ్, బేరియం, ఇతర భార లోహాలు, నీటిని విషంగా మార్చే సల్ఫర్ భూమిలో కలిసి నేలను, భూగర్భ జలాలను కలుషితం చేస్తాయి.

ఫోన్లు, రిమోట్లు, కంప్యూటర్ల మదర్ బోర్డులు, ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డులు, ఈ-చిప్స్‌లలోని బ్రోమిన్, బెరీలియం, కాడ్మియం, మెర్క్యూరీ వంటి భార లోహాలు భూమిలోకి చేరినా ప్రమాదమే. మండించినా వాటి నుంచి వచ్చే బూడిదలో భారలోహాలు అలాగే ఉండి నేలను, గాలిని విషతుల్యం చేస్తాయని నిపుణులంటున్నారు.

# ఆ కాలనీలు.. పల్లెల మధ్య పట్టణాలు

జగిత్యాల : జగిత్యాల పురపాలిక పరిధి అస్తవ్యస్తంగా మారింది. ఏది పంచాయతీనో, ఏది పురపాలికనో తెలియని పరిస్థితి నెలకొంది. ఒకే మార్గంలో ఒకచోట పురపాలిక, ఆ వెంటనే పంచాయతీ, మళ్లీ పురపాలిక, తర్వాత పంచాయతీ.. ఇలా స్థానిక సంస్థల పరిధి మారడంతో గందరగోళం నెలకొంది. పట్టణానికి సమీపంలో ఉన్న టీఆర్‌నగర్ ప్రాంతం గతంలో పంచాయతీగా ఉండేది. గత మున్సిపల్ ఎన్నికలకు ముందు పురపాలికలో కలిపి 47, 48 వార్డులుగా విభజించి ఎన్నికలు నిర్వహించారు. జిల్లాకేంద్రం నుంచి టీఆర్‌నగర్‌కు వెళ్లే మార్గంలో పద్మనాయక కల్యాణ మంటపం దాటిన తర్వాత ధరూర్ పంచాయతీ వస్తుంది. కొత్తవారెవరైనా ఇక్కడితో పట్టణ పరిధి ముగిసిందని భావిస్తారు. ధరూర్ కాలువ దాటగానే టీఆర్‌నగర్ వస్తుంది. ఇది మున్సిపాలిటీ పరిధిలో ఉన్న గ్రామంగా చెప్పవచ్చు. ఇక్కడితో పట్టణం ముగియలేదు. టీఆర్‌నగర్ తర్వాత మల్యాల మండలం రాజారం పంచాయతీ వస్తుంది. దీని తర్వాత నూకపల్లి



పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన అర్బన్‌కాలనీ వస్తుంది.

ఇక్కడ గత ప్రభుత్వ హయాంలో 4,250 రెండు పడక గదుల గృహాలు నిర్మించారు. అంతకుముందు జీవన్‌రెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో ఇందిరమ్మ పథకం కింద 4 వేల ఇళ్ల నిర్మాణం చేపట్టారు. అందులో కొన్ని మాత్రమే పూర్తి కాగా కాలనీలో దాదాపు 5 వేల ఇళ్లు అందుబాటులోకి వచ్చాయి. 5 వేల ఇళ్లున్న కాలనీలో దాదాపు 20 వేల జనాభా నివసించాలి. కాగా ప్రస్తుతం ఉంటోంది 1,250 మంది మాత్రమే. ప్రస్తుత ఎన్నికల్లో ఇక్కడ ఉంటున్న వారిలో కొందరికి మాత్రమే స్థానికంగా ఓటుహక్కు ఉంది. కొత్తగా ఏర్పాటు చేసిన 49, 50 వార్డుల్లో అర్బన్‌కాలనీ వాసులను చేర్చి టీఆర్‌నగర్‌లో కలిపారు.

**వసతులు లేక గృహాలు ఖాళీ**

అర్బన్ కాలనీలో దాదాపు 20 వేల జనాభా నివసిస్తే ఓటర్ల సంఖ్య 15 వేలకు చేరే అవకాశం ఉంది. అంటే వార్డుకు 2 వేల చొప్పున కొత్తగా 7 వార్డులు ఏర్పాటు చేయొచ్చు. అర్బన్ కాలనీలో వసతులు లేక స్థానికంగా ఇళ్లు మంజూరైన వారిలో చాలా మంది పట్టణంలోనే ఉంటున్నారు. దీంతో ఓట్లు పట్టణంలో, నివాసాలు అర్బన్‌కాలనీలో అన్న విమర్శ నెలకొంది. వాస్తవానికి ఇక్కడ ఇళ్లున్న వారందరూ స్థానికంగా నివాసం ఉంటే 7 వార్డులు ఏర్పాటవుతాయి. తద్వారా పాలకులు వసతులు మెరుగుపరిచే అవకాశం ఉంటుంది. అయినప్పటికీ ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. అర్బన్ కాలనీలో నివాసం ఉండాలని సూచిస్తున్నా లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదని, అందుకే ఇక్కడి ఓటర్లను టీఆర్‌నగర్‌లో కలిపి రెండు వార్డులు కొత్తగా ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ స్పందన తెలిపారు. మొత్తానికి జగిత్యాల పట్టణ పరిధిలోని టీఆర్‌నగర్, అర్బన్‌కాలనీలు 'పట్టణంలో పల్లెలు.. పల్లెల్లో పట్టణం' అన్న మాదిరిగా మారాయి. అర్బన్ కాలనీని ప్రత్యేక వార్డుల కింద విభజిస్తేనే అభివృద్ధి సాధ్యమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# వసతులు భ్రాంతి.. రైతుకేదీ విశ్రాంతి?



హైదరాబాద్: నగరంలో పెద్దదైన బోయిన్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో గతంలో ఏర్పాటు చేసిన రైతుల విశ్రాంతి భవనం నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి కూరగాయలు తీసుకొచ్చే రైతులు సేదదీరేందుకు పరిపాలన భవనం పక్కనే ఉన్న క్యాంటీన్ పైఅంతస్తులో దీనిని ఏర్పాటు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రైతులు కూరగాయలు, ఇతర పంటల విక్రయాలు పూర్తి చేసుకుని తిరిగి వెళ్లేందుకు కొన్ని రోజులు ఇక్కడ ఉండాల్సి ఉంటుంది. దీంతో వారు విశ్రాంతి తీసుకునేందుకు ఏర్పాటు చేసిన భవనంలో తొలుత అన్ని వసతులు కల్పించారు. అనంతరం దీని నిర్వహణను మార్కెట్ కమిటీ అధికారులు, ప్రతినిధులు పట్టించుకోక పోవడంతో అధ్వానంగా తయారైంది.

**నిత్యం వేలాది మంది రైతుల రాక**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2002లో 174 దుకాణాలు, మార్కెట్ కమిటీ కార్యాలయం, క్యాంటీన్, రైతులు, హమాలీల విశ్రాంతి భవనాలతో ఈ మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇరు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాలకు చెందిన వేలాది మంది రైతులు నిత్యం ఈ మార్కెట్‌కు 30 వేల నుంచి 35 వేల క్వింటాళ్ల కూరగాయలు తీసుకొస్తుంటారు. వీరు విశ్రాంతి తీసుకునేందుకు ఏర్పాటు చేసిన భవనంలోని ఫ్యాన్లు దెబ్బతిన్నాయి. మంచాలు శిథిలావస్థకు చేరాయి. భవనంలో అపరిశుభ్రత నెలకొంది. తాగునీటి వసతి లేదు. మరుగుదొడ్ల పరిస్థితి దయనీయంగా మారింది.

**వారం రోజులుగా ఇబ్బంది పడుతున్నా**

పల్లీల విక్రయం కోసం వారం కిందట మార్కెట్‌కు వచ్చా. అప్పటి నుంచి దుకాణం వద్దే ఉంటున్నా. గతంలో ఇక్కడి రైతు విశ్రాంతి భవనం ఎంతో బాగుండేది. ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. దీంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం.

నారాయణప్ప, అనంతపురం జిల్లా శింగనమల

**రూ.10 లక్షలతో ప్రతిపాదనలు**

శిథిలావస్థకు చేరిన రైతు విశ్రాంతి భవనాన్ని అభివృద్ధి చేసేందుకు రూ.10 లక్షలతో ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపాం. అప్పటి వరకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రైతులు సేదదీరేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం. రాగిరి ఆనంద్‌బాబుగౌడ్, మార్కెట్ కమిటీ ఛైర్మన్

# ఇప్పటికే లోటు.. విస్తరణతో మరింత భారం

హైదరాబాద్: హైదరాబాద్ మహానగర విస్తరణ జలమండలికి కొత్తగా ఆర్థిక కష్టాలు తెచ్చిపెడుతోంది. ఇప్పటికే ప్రతి నెలా రూ.130కోట్ల లోటుతో నడుస్తున్న జలమండలికి కొత్త ప్రాంతాల చేరిక ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటి వరకు జలమండలి పరిధి అధికారికంగా 1450 చదరపు కిలోమీటర్లు. తాజా విస్తరణతో 2080 చదరపు కిలోమీటర్లు కానుంది. ఓఆర్ఆర్ వెలుపల ఉన్న ప్రాంతాలు కూడా బృహత్ హైదరాబాద్‌లో భాగమయ్యాయి. దీంతో అన్ని ప్రాంతాల్లో తాగునీరు, మురుగునీటి వ్యవస్థలను ఏర్పాటుచేసేందుకు జలమండలికి భారీగా నిధులు అవసరం కానున్నాయి. ప్రభుత్వ పరంగా ప్రత్యేక తోడ్పాటు అందిస్తే తప్ప ముందుకు వెళ్లే పరిస్థితి ఉండదని ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు.

మురుగునీరు మూసీలో, చెరువుల్లో కలవకుండా.. శుద్ధికేంద్రాలకు తరలించాల్సి ఉంటుంది. దీనికి భారీగా నిధులు అవసరం.

జలమండలి ప్రతినెలా రూ.130 కోట్ల లోటుతో నడుస్తోంది. జలమండలికి వస్తున్న రాబడి వేతనాలు, నిర్వహణకే సరిపోతోంది.

కొత్తగా విలీనమవుతున్న ప్రాంతాల్లో పటిష్ఠమైన తాగునీరు, మురుగునీటి వ్యవస్థల ఏర్పాటుకు ప్రభుత్వమే ప్రత్యేకంగా నిధులు అందించాలి.

పరిధి పెరగనుండటంతో నీటి డిమాండ్ పెరుగుతుంది. గోదావరి జలాలు అందుబాటులోకి వచ్చే వరకు ప్రస్తుతం సరఫరా అవుతున్న 550 ఎంజీడీల నీరు సర్దుబాటు తప్పదు.



విలీనమైన ప్రాంతాల్లో భారీ సంఖ్యలో కొత్త నల్లా కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. ఇందుకు పైపులైన్ల ఏర్పాటు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంటుంది. మిషన్ భగీరథ ఆధీనంలో ఉన్న ప్రాంతాలకు తాగునీటిని సరఫరా చేసేలా మిషన్ భగీరథ నెట్‌వర్క్‌ను జలమండలి నెట్‌వర్క్‌తో అనుసంధానం చేయాల్సి ఉంటుంది.

విలీనమైన 20 మున్సిపాలిటీలు, ఏడు నగర పాలక సంస్థల్లో మురుగునీటి వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కొత్తగా సీవరేజీ మాస్టర్ ప్లాన్‌ను రూపొందించి అమలు చేయాల్సి ఉంటుంది. అందుకు భారీగా నిధులు అవసరమవుతాయి.

నిర్వహణ పరిధి పెరగనుండటంతో క్షేత్రస్థాయి, పర్యవేక్షక సిబ్బందిని అదనంగా నియమించుకోవాల్సి ఉంటుంది.

# బల్దియాలో విలీనం..

ఆదిలాబాద్ : ఆదిలాబాద్ మున్సిపాలిటీలో చుట్టుపక్కల గ్రామ పంచాయతీలు బల్దియాలో విలీనమై ఏడేళ్లు గడిచాయి. అభివృద్ధి పనులు, నిధుల కేటాయింపులో పాత 36 వార్డులతో విలీన కాలనీలు పోటీపడలేకపోయాయి. కొన్ని వార్డుల్లో అధ్వాన పరిస్థితులు మారుమూల గ్రామాలను తలపిస్తున్నాయి. కేఆర్కే కాలనీకి, 170 కాలనీకి వెళ్లే ప్రధాన రహదారుల నిర్మాణం మినహా ఇతరత్రా సదుపాయాలు కల్పించడంలో అధికార యంత్రాంగం విఫలమైంది. ఏడేళ్లుగా విలీన కాలనీల్లో సమస్యల పరిష్కారానికి అరకొరగానే నిధులు కేటాయించడంతో పూర్తిస్థాయిలో సమస్యలు పరిష్కారం కాలేదు. బల్దియా ఎన్నికలకు ప్రభుత్వం కసరత్తు చేస్తుండటంతో విలీన కాలనీల అంశం మరోసారి తెరపైకి వచ్చింది. తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.

**సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేవు**

మావల, బట్టిసావర్గాం గ్రామాలు మినహా వాటి పరిధిలోని కాలనీలు, అనుకుంట, బంగారుగూడ, బెల్లూరి, రాంపూర్ గ్రామాలు పూర్తిగా బల్దియాలో విలీనమయ్యాయి.

అంతకుముందు ఆయా పంచాయతీలకు ఏటా ఉపాధి హామీ పథకం కింద మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు నిర్మించుకునేందుకు అవకాశం ఉండేది. బల్దియాలో విలీనమయ్యాక ఉపాధిహామీ పథకం దూరమైంది. గుంతలమయమైన దారులు, మురుగునీరు రోడ్లపైనే ప్రవహించడం పరిపాటిగా మారింది.

కాలనీలివే..బంగారుగూడ, అనుకుంట, కేఆర్కే కాలనీ, 170 కాలనీ, పిట్టలవాడ, శ్రీనగర్, పద్మావతీనగర్, అగ్రజా టౌన్‌షిప్, సుభాష్‌నగర్, టీచర్స్ కాలనీ, సాయినగర్, ఉద్యోగుల కాలనీ, దుర్గానగర్, అంబికానగర్, మణిపూర్ కాలనీ, శంకర్‌గుట్ట, టైలర్స్ కాలనీ, పోలీస్ కాలనీ, గ్రీన్‌సిటీ, ఆదర్శనగర్, భగత్‌సింగ్‌నగర్..

జనాభా : 70 వేలు



ఓటర్లు : 40 వేలు

వర్షాకాలమైతే మట్టిరోడ్లు బురదమయమై జనం జారిపడ్డ ఘటనలున్నాయి. బల్దియా బడ్జెట్‌లో మూడింట ఒకవంతు విలీన కాలనీల అభివృద్ధికి కేటాయించాల్సి ఉండగా అరకొర నిధులతోనే సరిపెడుతున్నారు. గతంలో పట్టణ ప్రగతి కింద పలు అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచినా నిధులు రావడం లేదని గుత్తేదారులు ప్రారంభించకపోవడంతో ఆ టెండర్లన్నీ రద్దయ్యాయి. కల్వర్టుల నిర్మాణం, మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లు, వీధి దీపాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. కాలనీల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టడం, ఇంటింటా చెత్త సేకరణ ఇతరత్రా సేవలు అందించడంలో బల్దియా యంత్రాంగంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# పదవీకాలం ముగిసే.. పనులు ఆగే

మంచిర్యాల: మంచిర్యాల జిల్లా పరిషత్ సభ్యుల పదవీకాలం ముగిసిపోవడంతో వారి పాలనలో నిధులు కేటాయించిన అభివృద్ధి పనులు ఆగిపోయాయి. ఆయా గ్రామాల్లో ప్రజలు రహదారులు, మురుగుకాలువలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. 2019 నుంచి 2024 వరకు జిల్లా పరిషత్‌లో వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా అభివృద్ధి పనులు చేయడానికి రూ.13.66 కోట్లతో 393 పనులకు నిధులు కేటాయించారు. అప్పుడు 323 పనులు పూర్తి చేశారు. దాదాపు రూ.2.63 కోట్లతో చేయాల్సిన 70 పనులు పెండింగ్‌లో ఉన్నాయి. 2024 జులై 4న జిల్లా పరిషత్ సభ్యుల పదవీ కాలం ముగిసింది. తర్వాత జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారిగా, కలెక్టర్ కుమార్ దీపక్ బాధ్యతలు చేపట్టారు. ఆగిన పనులను పూర్తి చేయించడంలో అధికారులు నిర్లక్ష్యం చేయడంతో ప్రశ్నార్థకంగా మారాయి. భీమిని మండలంలో ఎస్సీ కాలనీ నుంచి వెంకటపూర్ వరకు రహదారి పక్కన కాలువ నిర్మించడానికి గతంలో రూ.5 లక్షలు కేటాయించారు. ఇప్పటికీ అక్కడ కాలువ నిర్మించడంలో అధికారులు జాప్యం చేస్తున్నారు. తాండూరు మండలం సుభద్ర కాలనీలో నివాసగృహాల ముందు కాలువలు లేక ఇళ్ల ముందు మురుగు నిలిచి దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గతంలో అక్కడ కాలువ నిర్మాణం కోసం రూ.5 లక్షలు మంజూరు చేశారు. ఇప్పటికీ అక్కడ కాలువ నిర్మించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. కోటపల్లిలో నివాసగృహాల మధ్యలో సీసీ రహదారి నిర్మాణం కోసం గతంలో రూ.5 లక్షలు కేటాయించారు. ఇంకా అక్కడ సిమెంట్ రహదారి నిర్మించడం లేదు. అక్కడ మట్టి రోడ్డు పైనుంచే ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు.

# 'పది'కి సన్నద్ధం

రాజపేట : పదో తరగతి ఫలితాల్లో గతంలో కంటే మెరుగైన ఫలితాలు సాధించాలని జిల్లా యంత్రాంగం ఉపాధ్యాయ వర్గాలను అప్రమత్తం చేసింది. ఈ విషయమై జిల్లా పాలనాధికారి హనుమంతరావు, డీఈవో సత్యనారాయణ ఎంఈవోలతో నిర్వహించిన సమీక్షలో పలు విషయాలను సూచించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతుల నిర్వహణ కొనసాగుతుంది. మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు వార్షిక పరీక్షలకు ముందు ప్రీఫైనల్ పరీక్షలను నిర్వహిస్తారు. ఈ 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రీఫైనల్ పరీక్షలు ఫిబ్రవరి 17 నుంచి 24 వరకు జరగనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ తాజాగా ప్రణాళిక విడుదల చేసింది. ఈ పరీక్షలతో విద్యార్థులు వార్షిక పరీక్షలకు మరింతగా ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం కావడానికి అవకాశం ఉంటుంది. ఫలితంగా ఎక్కువ శాతం ఉత్తీర్ణత సాధించడానికి అధ్యయనం చేసేలా సమాయత్తం చేయవచ్చు. జిల్లాలో ఉన్నత పాఠశాలలు 147 ఉండగా పదోతరగతి విద్యార్థులు 3,600 మంది ఉన్నారు.

**ప్రగతిని సమీక్షిస్తూ ముందుకు**

ప్రీఫైనల్ పరీక్షలు పూర్తికాగానే సమాధాన పత్రాలను వెంటనే మూల్యాంకనం చేయించేలా చూడాలని ఎంఈవోలకు, ప్రధానోపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ నుంచి ఆదేశాలు అందాయి. మూల్యాంకనం



తర్వాత విద్యార్థుల ప్రగతిని సమీక్షించాల్సి ఉంటుంది. ఈ సమీక్ష సమయంలో వందశాతం విద్యార్థులు తరగతులకు హాజరయ్యేలా చూడాలి. వారి ప్రగతి ఆధారంగా వార్షిక పరీక్షల వరకు సన్నద్ధం చేసే చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. వార్షిక పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా అధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నారు.

**ప్రీఫైనల్ పరీక్షల షెడ్యూల్ ఇలా..**

ఫిబ్రవరి 17న ప్రథమ భాష, 18న ద్వితీయ భాష, 19న తృతీయ భాష, 20న గణితం, 21న భౌతికశాస్త్రం, 23న జీవశాస్త్రం, 24న సాంఘికశాస్త్రం పరీక్షలు జరగనున్నాయి. భౌతిక, జీవశాస్త్ర పరీక్షలు ఉదయం 8.30 గంటల నుంచి 11 గంటల వరకు మిగతా పరీక్షలు 9.30 గంటల నుంచి 11 గంటల వరకు మిగతా పరీక్షలు 9.30 నుంచి 12.30 గంటల వరకు జరగనున్నాయి.




# రెండేళ్లలో అమరావతి నుంచి క్వాంటం కంప్యూటర్లు: సీఎం చంద్రబాబు

అమరావతి: ప్రభుత్వ పథకాలను అట్టడుగు వర్గాలకు కూడా చేరవేయాలని ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశించారు. సచివాలయంలో మంత్రులు, వివిధ శాఖల కార్యదర్శులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు వర్చువల్‌గా పాల్గొన్నారు. జీఎస్‌డీపీ వృద్ధిరేటు, స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యాలు, పది సూత్రాల అమలు, ఆదాయార్జన శాఖలు, రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, పీపీపీ ప్రాజెక్టుల పురోగతిపై సీఎం సమీక్షించారు. రియల్‌టైమ్ గవర్నెన్స్‌లో భాగంగా సాంకేతికతతో పాటు అవేర్, డేటా లేక్, పాలనలో ఏఐ టూల్స్ వినియోగం, కేంద్ర ప్రాయోజిత పథకాల యాక్షన్ ప్లాన్, యువతకు నైపుణ్యాభివృద్ధి, వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్ విధానం అమలుపై చర్చించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ వివిధ అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. "గతంలో జిల్లా కలెక్టర్ల సదస్సులు నిర్వహించేవారు కాదు.. ఇప్పుడు మూడునెలలకోసారి నిర్వహిస్తున్నాం. ప్రతినెలా రెండుసార్లు మంత్రివర్గ భేటీ జరుగుతోంది. నెలవారీగా అధికారులు సమీక్ష చేసుకోవాలి. జిల్లా స్థాయిలో కలెక్టర్లు, ఇన్‌ఛార్జ్ మంత్రులు సమర్థంగా పనిచేయాలి. ప్రపంచం గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ వైపు వెళ్తోంది. అమరావతి కేంద్రంగా క్వాంటం కంప్యూటింగ్‌కు శంకుస్థాపన చేశాం. రెండేళ్లలో ఇక్కడి నుంచి క్వాంటం కంప్యూటర్లు తయారవుతాయి. మనమే ప్రపంచానికి క్వాంటం కంప్యూటర్లు అందిస్తాం. ఏఐ, క్వాంటం కంప్యూటర్లు, డేటా సెంటర్లతో పెనుమార్పులు వస్తాయి"అని సీఎం అన్నారు. వివిధ శాఖల వారీగా పురోగతిని అధికారులు సీఎంకు వివరించారు.

# మార్చి నాటికి పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ: చంద్రబాబు



అమరావతి: 'సంజీవని' ద్వారా జులై నాటికి 66 లక్షల హైరిస్క్ కేసుల హెల్త్ స్క్రీనింగ్ చేయాలని ఏపీ సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కేర్ అండ్ గ్రో ద్వారా మాతాశిశు ఆరోగ్యం, పెరుగుదల వివరాలు నమోదు చేయాలని చెప్పారు. జనాభా నిర్వహణ, సంజీవని ప్రాజెక్టు, పౌష్టికాహారంపై సోమవారం సీఎం చంద్రబాబు సంబంధిత శాఖల మంత్రులు, కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. "మాతాశిశువులకు పౌష్టికాహారంతోపాటు సప్లిమెంట్స్ అందించేలా చర్యలు తీసుకోవాలి. మధ్యాహ్న భోజనం, అంగన్వాడీల్లో పౌష్టికాహారం అందేలా చూడాలి. సాధారణ ప్రసవాలు పెరిగేలా, సిజేరియన్లు తగ్గేలా చూడాలి. 60 ఏళ్లు దాటితే ఏ పనీ చేయలేమన్న సైకాలజీని ప్రజల్లో మార్చాలి. వివిధ వర్గాలతో అధికారులు మాట్లాడితే సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. ఫ్యామిలీ కార్డు బెనిఫిట్ సిస్టం ద్వారా జూన్ నాటికి సమగ్ర కార్డులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలి. వచ్చే ఏడాది ఎయిడ్స్ ఫ్రీ ఏపీగా డిక్లేర్ చేస్తాం. జనాభా విషయంలో చాలా దేశాల్లో వృద్ధుల సంఖ్య పెరిగింది. యూరప్‌లోని 20 దేశాల్లో ఏజింగ్ సమస్యతో సామాజిక వేడుకలు లేవు. ఏపీలో మార్చి నాటికి పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ తీసుకొస్తాం. పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేయాలి. పరీక్షలంటే విద్యార్థులకు ఎలాంటి ఒత్తిడి లేకుండా చూడాలి" అని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు.

# అధికారులు ఉదాసీనంగా వ్యవహరించవద్దు: పవన్‌కల్యాణ్




అమరావతి: క్షేత్రస్థాయిలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరించవద్దని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సూచించారు. క్షేత్రస్థాయి నుంచి పైస్థాయి అధికారి వరకు ఎవరికి వారు సక్రమంగా బాధ్యతలు నిర్వర్తించాల్సిందేనని చెప్పారు. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన వివిధ శాఖల కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పవన్ పాల్గొని మాట్లాడారు. తాము నాలుగు గోడల మధ్య కూర్చునే వ్యక్తులం కాదని పవన్ అన్నారు. అంతా అద్భుతంగా ఉందని చెబుతున్నా.. కొన్నిచోట్ల గ్యాప్స్ ఉన్నాయని వ్యాఖ్యానించారు. అనుకున్న లక్ష్యాలను నిర్దేశించుకున్న సమయానికి పూర్తిచేయాలని తేల్చిచెప్పారు. పాలసీలను అమలు చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామన్నారు. పల్లెపండుగకు రూ.2,500 కోట్లు, అడవితల్లి బాటకు రూ.1,005 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. వివిధ పథకాలకు రూ.11,328 కోట్లు మంజూరు అయ్యాయని వివరించారు. జల్‌జీవన్ మిషన్‌కు రూ.25వేల కోట్ల మొబిలైజేషన్ చేశామన్నారు. ఇప్పటికే దాదాపు రూ.10వేల కోట్ల పనులు ప్రారంభమయ్యాయని పవన్ తెలిపారు.

# మద్యం కుంభకోణం కేసు.. రాజ్ కెసిరెడ్డికి సుప్రీంలో చుక్కెదురు



దిల్లీ: వైకాపా హయాంలో జరిగిన ఏపీ మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఆయన బెయిల్ వ్యవహారంలో జోక్యం చేసుకోలేమని తెలిపింది. ఈ కేసులో ఏపీ హైకోర్టు రెగ్యులర్ బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించడంతో రాజ్ కెసిరెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. రాజ్ కెసిరెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది నాగముత్తు వాదనలు ప్రారంభించగానే ఈ పిటిషన్‌లో జోక్యం చేసుకోవడానికి ఏమీ లేదని ధర్మాసనం పేర్కొంది. ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా రాజ్ కెసిరెడ్డి ఉన్నారని.. ఆయనకు రెగ్యులర్ బెయిల్ ఎలా సాధ్యమని ప్రశ్నించింది. హైకోర్టు అన్నీ పరిశీలించాకే బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించిందని అభిప్రాయపడింది. ఈ సందర్భంగా నాగముత్తు వాదనలు కొనసాగించగా.. ధర్మాసనం పలు వ్యాఖ్యలు చేసింది. "ఈ కేసులో ప్రధాన కుట్రకు రాజ్ కెసిరెడ్డి కేంద్ర బిందువుగా ఉన్నట్లు మాకు అనిపిస్తోంది. ఈ దశలో మేం జోక్యం చేసుకోవడానికి ఏమీ లేదు. ఆయనకు బెయిల్ ఇస్తే దాని ప్రభావం కేసుపై తీవ్రంగా ఉంటుంది. ఈ కేసులో ఇప్పటివరకు తేలిన లెక్కల ప్రకారం రూ.750 కోట్లు డిపాజిట్ చేసిన షెల్ కంపెనీలతో కెసిరెడ్డికి నేరుగా సంబంధాలున్నట్లు కనిపిస్తోంది" అని ధర్మాసనం పేర్కొంది. 9 నెలలుగా రాజ్ కెసిరెడ్డి జైలులో ఉన్నారని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. 700 కోట్లకు పైగా అక్రమాలు చోటు చేసుకున్న వ్యవహారంలో 9 నెలలు జైలులో ఉండటం ఎక్కువేమీ కాదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ కేసుకు సంబంధించిన అన్ని విషయాలు కోర్టు ముందు ఉంచేందుకు న్యాయవాది సమయం కోరారు. దీంతో ధర్మాసనం తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది.

# గుంటూరుకు వైకాపా నేత అంబటి రాంబాబు తరలింపు



రాజమహేంద్రవరం: మురికి వ్యాఖ్యల కేసులో అరెస్టై రాజమహేంద్రవరం జైల్లో ఉన్న వైకాపా నేత అంబటి రాంబాబును గుంటూరు తరలించారు. పీటీ వారెంట్‌పై గుంటూరు కోర్టుకు పోలీసులు ఆయన్ను తీసుకెళ్లారు. వైద్య కళాశాలల పీపీపీ విధానంపై వైకాపా ఆందోళన సందర్భంగా పోలీసులతో అంబటి రాంబాబు దురుసుగా ప్రవర్తించారని గతంలో కేసు నమోదైంది. గతేడాది నవంబర్ 12న జరిగిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ కేసులో విచారణ కోసం అంబటిని రాజమహేంద్రవరం నుంచి గుంటూరు తరలించారు. సీఎంను దూషించిన కేసులో అంబటి రాంబాబు రిమాండ్ ఖైదీగా ఉన్నారు. మరోవైపు ఆయన బెయిల్ పిటిషన్, పోలీసుల కస్టడీ పిటిషన్‌పైనా కోర్టులో విచారణ జరగనుంది. పీటీ వారెంట్‌పై గుంటూరు తీసుకొచ్చి స్పెషల్ జ్యుడీషియల్ కోర్టులో హాజరుపరిచారు. విచారణ చేపట్టిన న్యాయమూర్తి ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించారు. మరోవైపు పోలీసుల కస్టడీ పిటిషన్, అంబటి రాంబాబు బెయిల్ పిటిషన్లపైనా కోర్టులో విచారణ జరగనుంది. అనంతరం రాజమహేంద్రవరం జైలుకు తరలిస్తారు.





ఓ యువకుడు మద్యం మత్తులో లంబోర్గిని కారుతో పాదచారుల పైకి దూసుకెళ్లాడు. మొదట ఓ ఆటోను ఢీకొట్టిన లగ్జరీ కారు దాదాపు 10 అడుగుల ఎత్తులో గాల్లోకి ఎగిరి పాదచారుల పైకి దూసుకువెళ్లింది. ఈ ఘటనలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూరులో ఈ ప్రమాదం జరిగింది. స్థానికంగా ఉండే ప్రముఖ పొగాకు వ్యాపారి కేకే మిశ్రా కుమారుడు శివం ఆదివారం మద్యం మత్తులో లంబోర్గినిని వేగంగా నడుపుతుండగా అదుపుతప్పి.. రోడ్డుపై ఉన్న పాదచారులు, వాహనాల పైకి దూసుకెళ్లినట్లు పోలీసులు పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే శివం ఘటనా స్థలం నుంచి పారిపోవడానికి ప్రయత్నించగా.. స్థానికులు అతడిని పట్టుకొని, పోలీసులకు అప్పగించారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. కారును స్వాధీనం చేసుకొని కేసుపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. అయితే మరో కారులో అక్కడికి చేరుకున్న వ్యాపారి కేకే మిశ్రా బౌన్సర్లు స్థానికులపై దౌర్జన్యం చేసినట్లు తెలుస్తోంది.

# మచిలీపట్నం పోర్టు రూపురేఖలు మారబోతున్నాయి: ఎంపీ బాలశౌరి



అమరావతి: మచిలీపట్నంలో నౌకానిర్మాణం, మరమ్మతుల కోసం ఏపీ మారిటైమ్ బోర్డుకు రాష్ట్ర ప్రభుత్వం అను మతి ఇచ్చిందని ఎంపీ బాలశౌరి తెలిపారు. దీంతో మచిలీపట్నం పోర్టు రూపురేఖలు మారనున్నాయని చెప్పారు. షిప్‌బిల్డింగ్, రిపేర్ సౌకర్యాల ఏర్పాటు కోసం జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో సంప్రదింపులు జరుగుతున్నాయన్నారు. ఇన్నాళ్లకు బందరు వాసుల కల నెరవేరనుందని తెలిపారు. అనుమతులు ఇచ్చిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు.

# ఎన్‌డీడీబీ రిపోర్టును బయటపెట్టాలి: శ్రీనివాసానంద సరస్వతి



విశాఖపట్నం: వేంకటేశ్వరస్వామి అంశంపై తప్పుడు ప్రచారం చేస్తే భక్తులు క్షమించరని సాధు పరిషత్ అధ్యక్షులు శ్రీనివాసానంద సరస్వతి అన్నారు. విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తిరుమల లడ్డూ వ్యవహారంపై మాట్లాడారు. వేంకటేశ్వర స్వామి పవిత్రతను కాపాడాలని కోరారు. "ఈ వ్యవహారంపై సిట్ నివేదికలు ఉన్నాయి. ఎన్‌డీడీబీ ఇచ్చిన రిపోర్టును బయటపెట్టాలి. ఇప్పటికే సాధు పరిషత్ తరఫున తితిదే ఈవోకి లేఖ రాశాం. లడ్డూల్లో రసాయనాలు కలిశాయని తెలిసిన తర్వాత కూడా బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో ఎందుకు ఆలస్యమవుతుంది? తితిదే గత ఛైర్మన్లకు తెలియకుండానే ఈ వ్యవహారం జరిగిందా? వైకాపా హయాంలోనే కల్తీ జరిగింది. అంతకుముందు లడ్డూ నాణ్యత బాగుండేది" అని శ్రీనివాసానంద సరస్వతి అన్నారు.




టెక్ కంపెనీల విదేశీ నియామకాలను తగ్గించేందుకు హెచ్-1బీ వీసా ప్రోగ్రామ్‌ను ట్రంప్ సర్కారు కఠిన తరం చేసింది. ఈ వీసాలకు ఏకంగా లక్ష డాలర్ల ఫీజును నిర్ణయించింది. అయినప్పటికీ.. టెక్ కంపెనీలు మాత్రం ఈ వీసాదారుల వైపే మొగ్గుచూపుతున్నాయి. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌పై భారీగా పెట్టుబడులు పెడుతున్న కంపెనీలు.. ఆ లక్ష్యాల సాధన కోసం పెద్ద సంఖ్యలో విదేశీ టాలెంట్‌ను నమ్ముకుంటున్నాయి. ఈ క్రమంలోనే 'హెచ్-1బీ' వీసాలకు డిమాండ్ పెరుగుతున్నట్లు నేషనల్ ఫౌండేషన్ ఫర్ అమెరికన్ పాలసీ నివేదిక వెల్లడించింది. ఇమిగ్రేషన్ డేటాను అధ్యయనం చేసి ఎన్ఎఫ్ఏపీ ఈ నివేదిక విడుదల చేసింది. దీని ప్రకారం.. 2025 ఆర్థిక సంవత్సరంలో కొత్త హెచ్-1బీ వీసాల జారీ కోసం టెక్ కంపెనీలు సమర్పించిన లేబర్ కండీషన్స్ అప్లికేషన్స్‌లో 80శాతానికి పైగా ఏఐ సంబంధిత నియామకాలవేనని నివేదిక తెలిపింది.

అత్యధికంగా అమెజాన్, మెటా, గూగుల్, మైక్రోసాఫ్ట్, యాపిల్ వంటి కంపెనీలు ఈ నియామకాలు చేపట్టినట్లు పేర్కొంది.

గత ఆర్థిక సంవత్సరంలో అమెజాన్ అత్యధికంగా 4,644 మంది హెచ్-1బీ వీసాదారులను నియమించుకుంది. సాఫ్ట్‌వేర్ డెవలపర్లు, కంప్యూటర్ అండ్ ఇన్ఫర్మేషన్ రీసెర్చ్ సైంటిస్టులు, డేటా సైంటిస్టుల విధుల కోసం కంపెనీలు ఈ వీసాదారులను ఉద్యోగంలోకి తీసుకుంటున్నాయి.

**ఏఐలో మనకు చిన్న మోడళ్లే మేలు..** అధునాతన ఏఐ సాంకేతికతలో అమెరికన్లకు నైపుణ్యాల కొరత వల్లే కంపెనీలు విదేశీ టాలెంట్‌పై ఆధారపడుతున్నట్లు ఎన్ఎఫ్ఏపీ నివేదిక తెలిపింది. అమెరికా వర్సిటీల్లో కంప్యూటర్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్ చదువుతున్న విద్యార్థుల్లో 80శాతం మంది విదేశీయులే. ఇక, ఎలక్ట్రికల్ అండ్ కంప్యూటర్ ఇంజినీరింగ్ విభాగంలో 75శాతం మంది విదేశీ విద్యార్థులున్నారు. చదువు పూర్తయిన తర్వాత ఈ గ్రాడ్యుయేట్లు కొంత కాలం పాటు శిక్షణ కింద పనిచేయవచ్చు. ఆ వ్యవధి తరువాత వారిని కంపెనీలు తీసుకోవాలంటే హెచ్-1బీ వీసా ఒక్కటే మార్గం.

అమెజాన్, మెటా, మైక్రోసాఫ్ట్, గూగుల్, యాపిల్ కంపెనీలు ప్రస్తుతం కృత్రిమ మేధపై భారీ పెట్టుబడులు పెడుతున్నాయి. 2025లో ఈ ఐదు కంపెనీలు 380 బిలియన్ డాలర్లకు పైగా ఏఐపై వెచ్చించాయి. రానున్న కాలంలోనూ ఈ రంగంపై భారీగా ఖర్చు చేసేందుకు సిద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలో దీర్ఘకాల లక్ష్యాల కోసం హెచ్-1బీ వీసా ఫీజులను భరించి నియామకాలు చేపట్టేందుకు కంపెనీలు మొగ్గుచూపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.




బెంగాల్‌లో నిర్వహిస్తోన్న 'సర్' కసరత్తు ను వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. సర్ ప్రక్రియలో ఏవైనా ఆదేశాలు, స్పష్టత అవసరమైతే తాము కల్పించుకుంటామని పేర్కొంది. అంతేకానీ సర్ ప్రక్రియలో అడ్డంకులు కల్పించే ప్రయత్నాలు చేయవద్దని బెంగాల్ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఈ విషయాన్ని అన్ని రాష్ట్రాలు అర్థం చేసుకోవాలని వ్యాఖ్యానించింది. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ(సర్) కోసం 300మంది అధికారులను కేటాయించాలని బెంగాల్ ప్రభుత్వాన్ని కోరితే..80 మంది గ్రేడ్-2 స్థాయి అధికారులనే కేటాయించిందని న్యాయస్థానానికి ఈసీ తెలియజేసింది. మరోవైపు ఎన్నికల సంఘం అధికారులు రాష్ట్రాన్ని లక్ష్యంగా చేసుకున్నారని, అర్హులైన ప్రజలను ఓటర్ల జాబితాల్లో చేర్చడం లేదని బెంగాల్ ప్రభుత్వం పేర్కొంది. ఇంటి పేర్లలో అక్షరదోషాలు, వివాహం తర్వాత మహిళల చిరునామాలలో మార్పు వంటి చిన్న లోపాలను సాకుగా చూపి.. ఓట్లు తొలగిస్తున్నారని ధర్మాసనానికి తెలిపింది. దీనివల్ల 1.36 కోట్ల మంది ఓటర్లు ప్రభావితమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేసింది. తమ స్థానికతను నిరూపించుకోవడానికి ఓటర్లకు ఈసీ ఒక్క అవకాశమూ ఇవ్వలేదని బెంగాల్ సర్కార్ న్యాయస్థానానికి తెలియజేసింది. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ రాష్ట్రంలో ఓటర్ల దరఖాస్తులు పూర్తి చేయడానికి, డేటాను ఖరారు చేయడానికి గడువును ఒక వారం పొడిగిస్తున్నట్లు వెల్లడించింది.

## హీట్ పుట్టిస్తున్న డింపుల్ హాయతి..

టాలీవుడ్‌లో గ్లామర్ తో పాటూ పర్ఫార్మెన్స్‌తో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి డింపుల్ హాయతి. 'కిలాడీ', 'రామబాణం' వంటి చిత్రాలతో కుర్రకారు గుండెల్లో సెగలు రేపిన ఈ భామ, సోషల్ మీడియాలో కూడా అదే స్థాయిలో హీట్ పెంచుతోంది. తాజాగా ఆమె షేర్ చేసిన బ్లాక్ అవుట్‌ఫిట్ ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. తన కిల్లింగ్ లుక్స్‌తో, అదిరిపోయే ఫిజిక్‌తో నెటిజన్లను కట్టిపడేస్తున్న ఈ సొగసరి ఫోటోషూట్ విశేషాలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. బ్లాక్ డ్రెస్సులో మైమరిపిస్తున్న డింపుల్ సోయగం: డింపుల్ హాయతికి ఫ్యాషన్ సెన్స్ , గ్లామర్‌ను ఎలా పండించాలో బాగా తెలుసు. తాజాగా ఆమె పోస్ట్ చేసిన ఫోటోలలో బ్లాక్ కలర్ స్టైలిష్ డ్రెస్ ధరించి మెరిసిపోతోంది. ఆమె చూపులు, ఆ పోజులు చూస్తుంటే కుర్రాళ్లకు నిద్ర కరువవ్వడం ఖాయం. 'గద్దలకొండ గణేష్'లో 'జర్రా జర్రా' అంటూ తన డాన్స్ స్టెప్పులతో థియేటర్లను ఊపేసిన ఈ బ్యూటీ, ఇప్పుడు తన గ్లామర్ ఫోటోలతో సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లను షేక్ చేస్తోంది. తన ఫిట్‌నెస్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టే డింపుల్, ఈ ఫోటోలలో తన పర్ఫెక్ట్ కర్వ్‌లను ప్రదర్శిస్తూ నెటిజన్లను మంత్రముగ్ధులను చేస్తోంది. కిలాడీ నుండి



రామబాణం వరకు.. ప్రస్థానం ఇదీ: కేవలం గ్లామర్ మాత్రమే కాదు, నటనలోనూ తనదైన ముద్ర వేయాలని తపిస్తోంది ఈ భామ. రవితేజ సరసన 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సినిమాలో అదిరిపోయే గ్లామర్ రోల్ పోషించి టాలీవుడ్‌లో ఒక్కసారిగా లైమ్ లైట్లోకి వచ్చింది. ఆ తర్వాత గోపీచంద్ సరసన 'రామబాణం'లో పద్ధతిగా ఉంటూనే తన నటనతో మెప్పించింది. ఒకవైపు కమర్షియల్ మాస్ సాంగ్స్ చేస్తూనే, మరోవైపు ప్రాధాన్యత ఉన్న పాత్రలను ఎంచుకుంటూ తన కెరీర్ గ్రాఫ్‌ను పెంచుకుంటోంది. ఈ తాజా ఫోటోషూట్ చూస్తుంటే, త్వరలోనే డింపుల్ మరిన్ని పెద్ద ప్రాజెక్టులను దక్కించుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. డింపుల్ హాయతి షేర్ చేసిన ఈ ఫోటోలపై నెటిజన్లు రకరకాల కామెంట్లతో ముంచెత్తుతున్నారు. బ్యూటీ, అగ్గి పుట్టిస్తున్నావు, టాలీవుడ్ సెన్సేషన్ అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్‌గా ఉంటూ తన అప్‌డేట్స్‌తో అభిమానులను అలరించే ఈ భామ, రాబోయే రోజుల్లో మరిన్ని వైవిధ్యమైన పాత్రలతో మన ముందుకు రానుంది. గ్లామర్ ప్లస్ టాలెంట్ ఉన్న ఈ సుందరి, స్టార్ హీరోయిన్ రేసులో దూసుకుపోవడం ఖాయం.

## బంగారం మేలిమ బంగారమయ్యేనా?

సమంత వెండితెరపై హీరోయిన్ గా కనిపించి రెండున్నరేళు అవుతోంది. -ఖుషీ- తర్వాత అమెరికా పయనం.. తిరి గొచ్చిన తర్వత వ్యక్తిగత వ్యవహారాల్లోనే బిజీ అయింది. మధ్యలో -శుభం- చిత్రంలో గెస్ట్ అపిరియన్స్ ఇచ్చింది. తాను నిర్మించిన సినిమా కావడంతో? అలా కనిపించి వెళ్లిపోయింది. ఈ క్రమంలోనే బాలీవుడ్ దర్శక, నిర్మాత రాజ్ నిడి మోరుతో వివాహం..వెకేషన్ అంటూ నెట్టింట వైరల్ అయింది. ప్రస్తుతం -మా ఇంటి బంగారం- అనే లేడీ ఓరియేం టెడ్ చిత్రంలో నటిస్తోంది. తనని సోలో నాయికగా ప్రోజెక్ట్ చేసే సత్తా నందిని రెడ్డికే ఉందంటూ నమ్మి అవకాశం ఇచ్చింది. తానే స్వయంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఇదే ఏడాది సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఈ సినిమా తర్వాత సమంత జర్నీ ఎలా ఉంటుంది? అన్నది ఆసక్తికరం. తానేంత మేలిమ బంగారంగా పనిచేస్తుంది? అన్నది చర్చనీయాంశంగా మారింది. కథలు, పాత్రల విషయంలో సమంత సెలక్షన్ ఎలా ఉంటుంది? కొత్తగా జీవితంలో కి భాగస్వామిని ఆహ్వానిం



చిన నేపథ్యంలో ఎలాంటి మార్పులు తీసుకొస్తుంది? అన్నది అంతే ఆసక్తికరం. సామ్ కెరీర్ ఆరంభంలోనే బోల్డ్ గా నటించింది. నాగ చైతన్య తో లిప్ లాక్ సన్నివేశంలో నటించి సంచలనమైంది. కానీ ఆ తర్వాత సామ్ నటిగా ఎదిగే కొద్ది అలాంటి సన్నివేశాలకు పూర్తిగా దూరమైంది. తెరపై గ్లామర్ హైలైట్ అయిం ది లేదు. నటనకు ఆస్కారం ఉన్న పాత్రలు...కమర్శియల్ చిత్రాల్లోనే కొనసాగింది. -పుష్ప ది రైజ్- లో మాత్రం -ఊ అంటావా మావ- పాటలో బోల్డ్ అప్పిరియన్స్ తో ఆకట్టుకుంది. ఆ పాటతో పాన్ ఇండియాలో సంచలనమైంది. కానీ ఆ వెంటనే మళ్లీ అలాంటి పాటల్లో నటించనని నిర్ణయం అంతే వేగంగా తీసుకుంది. సమంత నుంచి ఈనిర్ణయం అభి మానులకు షాకింగ్ గానే అనిపించింది. గ్లామర్ వరల్డ్ లో రాణించాలంటే పోటీని తట్టుకోవాలి. అది జరగాలంటే? దర్శకుల హీరోయిన్ గా పని చేయాలి. కానీ అందుకు భిన్నంగా సామ్ ప్రయాణం కొనసాగుతోంది. బాలీవుడ్ కి వెళ్లిన కొత్తలో అమ్మడు అక్కడ కల్చర్ కు తగ్గట్టే హైలైట్ అయింది. చిట్టి పొట్టి దుస్తుల్లో అలరించింది. సీటాడెల్ లాంటి వెబ్ సిరీస్ లో ఏమాత్రం రాజీ పడకుండా పని చేసింది. కానీ ఇదంతా రాజ్ నిడిమోరుతో వివాహం..ప్రేమకు ముందు జరిగిన తంతు. కాలక్రమంలో కొన్ని రకాల మార్పులు తీసుకొచ్చింది. మరి ఇదే మార్పును భవిష్యత్ కాలంలోనూ కొనసాగిస్తుందా? అవసరం మేర పరిమితుల్ని పక్కన బెడుతుందా? అన్నది చూడాలి. ప్రస్తుతం సమంత ముంబైలో ఉంటుంది. అవసరం మేర హైదరాబాద్ వచ్చి వెళ్తోంది.




## అనుదీప్ కామెడీ అంటే ఇదే.. విశ్వక్ సేన్‌తో ఫుల్ ఫన్ లోడింగ్..



అర్థంపర్థం లేనట్టుగా అనిపించే ఫంకీ డైలాగ్స్‌తోనే కడుపుఉబ్బ నవ్వించగల ప్రత్యేకమైన సత్తా ఉన్న దర్శకుడు.. అనుదీప్. జాతి రత్నాలు సినిమాలో ఆయన అదే తరహా వన్‌లైనర్లతో ప్రేక్షకులను విపరీతంగా ఎంటర్‌టైన్ చేశాడు. సినిమా మాత్రమే కాదు, సాధారణ ఇంటర్వ్యూల్లో కూడా అనుదీప్ చెప్పే మాటల్లో అదే సహజమైన హ్యూమర్ కనిపిస్తుంది. ఇప్పుడు అదే స్టైల్‌ను మరోసారి ఫంకీ చిత్రంతో చూపించబోతున్నాడు. ఈరోజు విడుదలైన ఫంకీ సినిమా ట్రైలర్ చూసిన వెంటనే ప్రేక్షకులకు ఒక విషయం స్పష్టంగా అర్థమవుతుంది. ఇది పూర్తిగా అనుదీప్ స్టైల్ కామెడీ సినిమా. ట్రైలర్ మొదటి సీన్ నుంచే నవ్వులు పూయించే డైలాగ్స్‌తో స్టార్ట్ అవుతుంది. "మీ అమ్మకి ఆపరేషన్ చేయాలి" అని డాక్టర్ చెప్పగానే, "నాకు ఆపరేషన్ చేయడం రాదండి" అని అక్కడి వ్యక్తి చెప్పే సీన్ ట్రైలర్‌కు పెద్ద హైలైట్‌గా నిలిచింది. ఈ ఒక్క డైలాగ్‌తోనే దర్శకుడు అనుదీప్ ఖం మార్క్ హ్యూమర్ ఈ సినిమా మొత్తం ఉంటుందని చెప్పకనే చెప్పింది. ఈ సినిమాలో విశ్వక్ సేన్ ఒక సినిమా డైరెక్టర్ పాత్రలో కనిపించబోతున్నాడు. కోమలి అనే పాత్రలో ఆయన నటన ట్రైలర్‌లోనే ఆసక్తిని పెంచింది. సినిమా తీయాలనే ఆశతో ఉన్న కోమలి..కయాదు లోహర్ నిర్మాణంలో ఒక సినిమాని ప్రారంభిస్తారు . ఆ సమయంలో ఎదురయ్యే వింత సంఘటనలు, అపార్థాలు, సరదా సన్నివేశాలే ఈ సినిమాకు ప్రధాన బలంగా కనిపిస్తున్నాయి. కథ కంటే కూడా డైలాగ్స్..సిట్యుయేషన్ కామెడీ మీదే సినిమా నడుస్తుందని ట్రైలర్ స్పష్టంగా చూపించింది. ట్రైలర్ మొత్తం ఫంకీ డైలాగ్స్‌తో నిండిపోయింది. 2000 రూపాయల్లో 5000 రూపాయల చీర చూపించండి.. అలాగే టెన్త్ క్లాస్ లో నువ్వు ఫస్ట్ క్లాస్ ఆ.. అంతే.. కాదు టెన్త్ క్లాస్ అంటూ సాగే డైలాగులు. అనుదీప్ స్టైల్‌ను గుర్తు చేస్తున్నాయి. ఇవన్నీ చూసినప్పుడు జాతి రత్నాలు సినిమా ఫీల్ మళ్లీ గుర్తుకు వస్తుంది. హీరోయిన్‌గా డ్రాగన్ ఫేమ్ కయాదు లోహర్ నటిస్తోంది. ఆమె పాత్ర కూడా కామెడీకి మంచి సపోర్ట్ ఇస్తుందని ట్రైలర్ చెబుతోంది. ఈ చిత్రానికి సంగీతం అందించిన భీమ్స్ సిసిరోలియో బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ట్రైలర్‌కు అదనపు ఎనర్జీ ఇచ్చింది. ఈ సినిమాను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్.. ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ హైదరాబాద్‌లోని శ్రీ రాములు థియేటర్ లో జరిగింది. ఫిబ్రవరి 13న థియేటర్లలోకి రానున్న ఫంకీ, నవ్వులు పూయించే పూర్తి కామెడీ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకులను ఆకట్టుకునేలా కనిపిస్తోంది.

## ఉస్తాద్..సెకండ్ సాంగ్ పవన్ ఎలివేషన్స్ పీక్స్!



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ సినిమా వచ్చేస్తోందంటే ఫ్యాన్స్‌లో ఉండే ఆ క్రేజే వేరు. థియేటర్ల వద్ద జరిగే హంగామా నెక్ట్స్ లెవెల్‌లో ఉంటుంది. బాక్సాఫీస్ వద్ద ఏ హీరో సినిమా సందడి చేస్తూ పవన్ ఎంట్రీ ఇచ్చాడంటే ఆ కథే వేరుగ ఉంటుంది. ఆ వైబ్ ఫ్యాన్స్‌ని ఉక్కిరి బిక్కిరి చేస్తుంది. -ఓజీ-లో ఓ రేంజ్ పూనకాలతో ఊగిపోయిన ఫ్యాన్స్ ఇప్పుడు -ఉస్తాద్ భగత్‌సింగ్- కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. హరిశ్ శంకర్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ రిలీజ్‌కి రెడీ అవుతోంది. పవన్, హరీష్ శంకర్‌ల కలయికలో వచ్చిన మూవీ -గబ్బర్‌సింగ్-. ఈ మూవీ ఏ స్థాయి విజయాన్ని సాధించిందో..పవన్ అభిమానులకు ఎలాంటి ఆనందాన్ని కలిగించిందో అందరికి తెలిసిందే.

మళ్లీ ఇన్నేళ్ల విరామం తరువాత అదే కాంబినేషన్‌లో రూపొందుతున్న -ఉస్తాద్ భగత్‌సింగ్- అదే స్థాయి మ్యాజిక్‌ని రిపీట్‌చేస్తుందని ఫ్యాన్స్‌తో పాటు సినీ లవర్స్ కూడా ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇందులోనూ పవన్ కల్యాణ్ పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనుండటంతో అబిమానులు అంచనాలు తారా స్థాయికి చేరుకున్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై అంచనాల్ని పెంచేసింది. శ్రీలీల, రాశీఖన్నా హీరోయిన్‌లుగా నటిస్తున్న ఈ మూవీని మార్చి 26న భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మైత్రీ మూవీ మేకర్స్ వారు ప్లాన్ చేస్తున్నారు. రామ్‌చరణ్ -పెద్ది- -ఉస్దాద్ భగత్‌సింగ్- కోసం వెనక్కి తగ్గడంతో మెగా ఫ్యాన్స్‌కి పండగ ముందే రాబోతోంది. -గబ్బర్‌సింగ్-లో దేవీ అందించిన ఆడియో.. ఆ పాటల్లో పవన్ వేసిన మాసీవ్ స్టెప్స్ హైలైట్‌గా నిలవడం తెలిసిందే. ఆ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని -ఉస్తాద్ భగత్‌సింగ్-లోనూ పవన్ చేత మాసీవ్ స్టెప్స్ వేయిస్తున్నట్టుగా తెలుస్తోంది.ఇప్పటికే విడుదలైన -దేఖ్ లేంగే సాలా-..ఆ విషయాన్ని స్పష్టం చేసింది. ఈ పాటలో పవన్ వేసిన స్టెప్పులు ఫ్యాన్స్‌కు పూనకాలు తెప్పిస్తున్నాయి.

ఈ నేపథ్యంలోనే ఈ మూవీకి సంబంధించిన సెకండ్ సాంగ్ అప్ డేట్ వచ్చేసింది. ఇందులో పవన్ ఎలివేషన్స్ పీక్స్‌లో ఉంటాయిని, థియేటర్లలో అభిమానులు ఓ రేంజ్‌లో రచ్చ చేయడం ఖాయమనే టాక్ వినిపిస్తోంది. -ఏ తరమైనా నీ తరమే.. మా గుండెల్లో నీ స్థానం సుస్థిరమే..- అంటూ సాగే లిరిక్స్ పవన్ మాస్ ఇమేజ్‌ను, తనకున్న క్రేజ్‌కు పీక్స్‌కు తీసుకెళుతుందని నెట్టింట ప్రచారం జరుగుతోంది.

-గబ్బర్‌సింగ్- పాటలకు థియేటర్లలో పూనకాలతో ఫ్యాన్స్ ఊగిపోయినట్టుగానే -ఉస్తాద్ భగత్‌సింగ్-లోని పాటలకు ఫ్యాన్స్‌కు పూనకాలు రావడం ఖాయమని, థియేటర్లలో ఈ పాటలు ఓ రేంజ్‌లో రచ్చ చేస్తాయని ఇండస్ట్రీ వర్గాలు అంటున్నాయి. ఇప్పటికే భారీ హైప్ క్రియేట్ అయిన ఈ మూవీ థియేటర్లలో ప్రేక్షకులకు, అభిమానులకు ఫుల్ ట్రీట్ ఇవ్వడం గ్యారంటీ అనే టాక్ వినిపిస్తోంది. సినిమా ఏరేంజ్‌లో ఉంటుందన్నది తెలియాలంటే మార్చి 26 వరకు వేచి చూడాల్సిందే.

## పవన్ మూవీ.. శ్రీలీలకు ఆ సెంటిమెంట్ కలిసొస్తుందా?

టాలీవుడ్ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ లీడ్ రోల్ లో నటించిన ఉస్తాద్ భగత్ సింగ్ మూవీ రిలీజ్ కు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. మాస్ అండ్ యాక్షన్ ఎంటర్టైనర్ గా రూపొందుతున్న ఆ సినిమాకు హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే వీరిద్దరి కాంబోలో వచ్చిన గబ్బర్ సింగ్ మూవీ బ్లాక్ బస్టర్ హిట్ కావడంతో ఉస్తాద్ భగత్ సింగ్ పై భారీ అంచనాలు నెలకొన్నాయి. దానికి తోడు ఇప్పటి వరకు రిలీజ్ అయిన ప్రమోషనల్ కంటెంట్ కూడా సూపర్ రెస్పాన్స్ అందుకుంది. దీంతో సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ హిట్ అవుతుందని అంతా ఎక్స్పెక్ట్ చేస్తున్నారు. అదే సమయంలో మూవీలో ఫిమేల్ లీడ్ రోల్ పోషిస్తున్న యంగ్ బ్యూటీ శ్రీలీల తన కెరీర్ కు టర్నింగ్ పాయింట్ అవుతుందని ఆశిస్తున్నారు. ఎందుకంటే ఆమె కొంతకాలంగా సరైన హిట్ కోసం వెయిట్ చేస్తున్న విషయం తెలిసిందే. పెళ్లి సందడి మూవీతో టాలీవుడ్ లోకి వచ్చిన శ్రీలీల.. తక్కువ టైమ్ లోనే ఎక్కువ క్రేజ్ సంపాదించుకున్నారు. డ్యాన్స్, స్క్రీన్ ప్రెజెన్స్, గ్లామర్ తో ఓ రేంజ్ లో ఫ్యాన్ బేస్ ఆమె సొంతమైంది. స్టార్ హీరోల



సరసన ఛాన్స్ లు అందుకుని ఒక్కసారిగా లైమ్ లైట్ లోకి వచ్చిన అమ్మడు.. ఏకంగా స్టార్ హీరోయిన్ గా మారిపోయారు. భారీ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన శ్రీలీలకు రిజల్ట్ విషయంలో మాత్రం నిరాశ ఎదురైంది. దీంతో బ్లాక్ బస్టర్ హిట్ కోసం వెయిట్ చేస్తున్నారు. ప్రస్తుతం నార్త్ టు సౌత్ పలు సినిమాల్లో యాక్ట్ చేస్తున్న శ్రీలీల.. ఉస్తాద్ భగత్ సింగ్ పై భారీ ఆశలు పెట్టుకున్నారు. మార్చి 26వ తేదీన రిలీజ్ కానున్న ఆ మూవీ.. తన కెరీర్ ను మలుపు తిప్పుతుందని ఎక్స్పెక్ట్ చేస్తున్నారు. అదే సమయంలో పవన్ కళ్యాణ్ తో నటించిన పలువురు హీరోయిన్లకు కెరీర్ లో మంచి బ్రేక్ దక్కిన ఎగ్జాంపుల్స్ ను ఫ్యాన్స్ గుర్తు చేస్తున్నారు. ముఖ్యంగా శ్రుతి హాసన్ వరుస ఫ్లాపులతో ఇబ్బందులు పడుతున్న సమయంలో గబ్బర్ సింగ్ మూవీలో పవన్ సరసన యాక్ట్ చేశారు. ఆ సినిమా బ్లాక్ బస్టర్ కావడంతో ఆమె కెరీర్ ఒక్కసారిగా మారిపోయింది. వరుస విజయాలతో స్టార్ హీరోయిన్ గా ఎదిగిపోయారు. ఇప్పుడు అదే సెంటిమెంట్ శ్రీలీల విషయంలో కూడా వర్కౌట్ అవుతుందా అన్న ఆసక్తి నెలకొంది. అలా అనుకున్నట్లు జరిగితే.. అంచనాలకు తగ్గట్లు సినిమా సూపర్ హిట్ అయితే.. శ్రీలీల కెరీర్ కు కొత్త ఊపు రావడం ఖాయం. ఇప్పటివరకు వచ్చిన ఫ్లాపులన్నింటినీ మరిచిపోయేలా బ్లాక్ బస్టర్ దక్కితే అమ్మడు దూసుకుపోవడం పక్కా. మరిన్ని చిత్రాలతో బిజీగా మారనుంది. ఏదేమైనా ఉస్తాద్ భగత్ సింగ్ మూవీ ఎలా ఉంటుందో.. ఎంతలా అలరిస్తుందో.. శ్రీలీలకు ఎంతటి హిట్ ఇస్తుందో వేచి చూడాలి.

## సెల్ఫ్ డిఫెన్స్ లో పట్టు.. విశాల్ కాబోయే భార్యలో మరో టాలెంట్ కూడా!

ప్రముఖ కోలీవుడ్ స్టార్ హీరోగా గుర్తింపు తెచ్చుకున్న విశాల్ ఎప్పుడు పెళ్లి చేసుకుంటారు అని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూడగా.. ప్రముఖ హీరోయిన్ సాయి ధన్సికతో ఏడడుగులు వేయబోతున్నాను అని గత ఏడాది ప్రకటించారు. వాస్తవానికి 2025 ఆగస్టు 29న వివాహం చేసుకోవాలనుకున్నారు. కానీ నడిగర్ సంఘం భవనం పూర్తయిన తర్వాతనే ఆ భవనంలో జరిగే తొలి పెళ్లి వేడుక తమదేనని చెప్పి పెళ్లిని కాస్త వాయిదా వేశారు. ఇకపోతే పెళ్లి వాయిదా పడడంతో కెరియర్ పై దృష్టిపెట్టారు. అందులో భాగంగానే విశాల్ వరుస సినిమాలు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంటే.. తనదైన నటనతో అభిమానులను మెప్పించే ప్రయత్నం చేస్తోంది సాయి ధన్సిక. సాయి ధన్సిక ప్రధాన పాత్రలో నటించిన చిత్రం యోగి డా. ఫిబ్రవరి 6వ తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదలయ్యింది. శ్రీ మోనిక సినీ ఫిలిమ్స్ బ్యానర్ పై వి. సెంథిల్ కుమార్ నిర్మించగా.. నూతన దర్శకుడు గౌతమ్ కృష్ణ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. మనోబాల, ఎస్తేర్, రాజ్ కపూర్, షాయాజీ షిండే, కబీర్ దుహాన్ సింగ్ తదితరులు కీలక



పాత్రలు పోషిస్తున్నారు. ఇక ఇందులో సాయి ధన్సిక పవర్ఫుల్ లేడీ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటించింది. ఇకపోతే ఒకవైపు ఆమె సినిమా థియేటర్లలో సందడి చేస్తుంటే.. మరొకవైపు ఆమెకు సంబంధించిన పలు విషయాలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. అందులో భాగంగానే ఆమె ఒక గొప్ప ఫుట్ బాల్ ప్లేయర్ అని, అలాగే సెల్ఫ్ డిఫెన్స్ లో పట్టు ఉందని తెలిసి అందరూ ఆశ్చర్యపోతున్నారు. విషయంలోకి వెళ్తే.. క్రేజీ హీరోయిన్ గా ఒక వెలుగు వెలుగుతున్న సాయి ధన్సిక చిన్నతనంలోనే అథ్లెట్ కావాలనుకుందట. అందులో భాగంగానే స్కూలు ఫుట్బాల్ టీమ్ కి కెప్టెన్ గా వ్యవహరించింది. దాదాపు పలు కాంపిటీషన్లో పాల్గొని సుమారుగా 15 పథకాలను కూడా అందుకుంది. అంతేకాదు ఈమెకు సెల్ఫ్ డిఫెన్స్ లో మంచి పట్టు కూడా ఉంది. ఇదే విషయాన్ని ఇటీవల ఒక ప్రమోషనల్ ఇంటర్వ్యూలో చెబుతూ.. యోగి డా సినిమా షూటింగ్స్ సమయంలో ఒక వ్యక్తి నాతో సెల్ఫీ దిగాలని.. మా అంకుల్ని అడిగితే ..ఆ వ్యక్తి తాగి ఉన్నాడని గమనించి.. మా అంకుల్ ఒప్పుకోలేదట. అయితే మా అంకుల్ ని కొట్టి ఆ వ్యక్తి పారిపోయే ప్రయత్నం చేయడంతో.. సుమారు పది నిమిషాల పాటు ఆ తాగుబోతును చితక్కొట్టాను. అటు దర్శకుడు, హీరో నన్ను కంట్రోల్ చేసేందుకు ప్రయత్నించారు . అయితే నాకు సెల్ఫ్ డిఫెన్స్ కోసం నేను స్పెషల్ ట్రైనింగ్ కూడా తీసుకున్నాను.. ఆ టాలెంట్ అంతా అప్పుడు ఉపయోగించాను అంటూ చెప్పుకొచ్చింది. ఇక ఈమె మంచి ఫుట్బాల్ ప్లేయర్ మాత్రమే కాదు సెల్ఫ్ డిఫెన్స్ లో ట్రైనర్ కూడా అని తెలిసి అందరూ ఆశ్చర్యపోతున్నారు.



# ముగిసిన మున్సిపల్ ఎన్నికల ప్రచారం

**హైదరాబాద్: తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన ప్రచారానికి తెరపడింది. నేటితో ప్రచార గడువు ముగియడంతో రాష్ట్రవ్యాప్తంగా మైకులు మూగబోయాయి. ఈనెల 11న రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు పోలింగ్ జరగనుంది. మొత్తం 12,930 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఎన్నికల కోసం 8,203 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సంఘం సిద్ధం చేసింది. ఈనెల 13న ఓట్ల లెక్కింపు ఉంటుంది.**

## మున్సిపల్ ఎన్నికలకు.. మోదీకి ఏం సంబంధం?: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో త్రిముఖ పోరు నెలకొందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. భవిష్యత్తును ఆలోచించుకొని ఓటు వేయాలని ప్రజలను కోరారు. 12 ఏళ్లుగా కేంద్రంలో ఉన్న భాజపా.. తెలంగాణకు ఏమైనా ప్రాజెక్టులు మంజూరు చేసిందా? అని ప్రశ్నించారు. సోమవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు.

"పాలమూరు-రంగారెడ్డిని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటిస్తామని ప్రధాని మోదీనే స్వయంగా హామీ ఇచ్చారు. వాటి గురించి చెప్పట్లేదు.. కానీ, మోదీని చూసి ఓటేయాలని భాజపా నేతలు అడుగుతున్నారు. వరదల్లో నీటమునిగిన వస్తువులన్నీ కేంద్రం నుంచి నిధులు తెచ్చి తిరిగిస్తామని గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బండి సంజయ్ హామీ ఇచ్చారు. ఆ హామీని నమ్మి ఆ పార్టీకి చెందిన 50 మందిని కార్పొరేటర్లుగా గెలిపించారు. ఎన్నికలయ్యాక అడిగితే.. వస్తువులకు బీమా ఉంటుందని బండి సంజయ్ మాటమార్చారు.

**దక్షిణాదికి తీవ్ర అన్యాయం...** తెలంగాణకు రూ.లక్షల కోట్లు ఇచ్చామని భాజపా నేతలు చెబుతున్నారు. దీనిపై సీఎస్‌ను వివరణ అడిగితే.. మనం రూపాయి చెల్లిస్తే.. కేంద్రం 42 పైసలు ఇస్తోందని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాలకు భాజపా తీవ్ర అన్యాయం చేస్తోంది. బిహార్ ఒక్క రూపాయి పన్ను చెల్లిస్తే.. రూ.6.16 కేంద్రం ఇస్తోంది. తెలంగాణకు అన్యాయం జరుగుతున్నప్పుడు ఏ రోజైనా కిషన్‌రెడ్డి, బండి సంజయ్ మాట్లాడారా? మనకు అదనంగా ఇవ్వాల్సిన అవసరం లేదు. మనం చెల్లించిన నిధులు తిరిగిస్తే చాలు. కేంద్రానికి వచ్చే పన్నుల్లో దక్షాణాది రాష్ట్రాలే 40 శాతానికి పైగా చెల్లిస్తున్నాయి. తెలంగాణకు వచ్చిన ఐటీఐఆర్ ప్రాజెక్టును రద్దు చేశారు. హైదరాబాద్‌కు వచ్చిన సెమీకండక్టర్ ప్రాజెక్టును మోదీ ఒత్తిడి చేసి.. ఏపీకి తరలించారు. ఇప్పుడు మోదీని చూసి ఓటేయాలని భాజపా నేతలు అడుగుతున్నారు. అసలు మున్సిపల్ ఎన్నికలకు మోదీకి ఏం సంబంధం? భాజపా నేతలకు దేవుడు అసదుద్దీన్ ఒవైసీ. ఆయన పేరు లేకుండా ఆ నేతల ప్రచారం ఉండదు. మత రాజకీయాల ద్వారా భాజపా రాజకీయ మనుగడ సాగిస్తోంది" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.



## ధనవంతులు, గుణవంతులకు మధ్య పోటీ: బండి సంజయ్

కరీంనగర్: ఇచ్చిన హామీలు, గ్యారంటీలను కాంగ్రెస్ పార్టీ అమలు చేయడం లేదని కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శించారు. కరీంనగర్‌లో జరుగుతున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ధనవంతులు, గుణవంతులకు మధ్య పోటీ జరుగుతోందని చెప్పారు. నగరంలోని పలు ప్రాంతాల్లో భాజపా నేతలతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కరీంనగర్ అభివృద్ధికి స్థానికులు సహకరించి కమలం గుర్తుపై ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే పన్నులు పెంచుతారన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడిస్తేనే హామీల అమలు: కేటీఆర్



రాష్ట్రంలో కాంగ్రెస్ నేతలు ఎన్నికల హామీలను పక్కనపెట్టి కుంభకోణాలకు తెరలేపారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. రెండేళ్ల ఆ పార్టీ పాలనలో ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదని విమర్శించారు. భూపాలపల్లి, పరకాలలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సింగరేణిని సీఎం రేవంత్, ఆయన బావమరిది దోచుకున్నారని కేటీఆర్ ఆరోపించారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే ప్రజలను ఆ పార్టీ నేతలు ముంచుతారన్నారు. రూ.4వేల పింఛను, తులం బంగారం వచ్చినవారు కాంగ్రెస్‌కు ఓటేయాలని ఎద్దేవా చేశారు. రూ.2వేల పింఛను, రైతుబంధు పొందిన వారు బీఆర్ఎస్‌కు ఓటేయాలని కోరారు.

ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడిస్తేనే హామీలు అమలవుతాయని చెప్పారు. బీఆర్ఎస్ అభ్యర్థులను గెలపించాలని కోరారు.



## ఆసియాలో మెరుగైన స్థితికి భారత్..

అమెరికాతో ట్రేడ్ డీల్ తర్వాత ఆసియాలో భారత్ మెరుగైన స్థితికి చేరుకుందని జేఎం ఫైనాన్షియల్ (ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ సంస్థ) నివేదిక వెల్లడించింది. ఈ ఒప్పందం భారత మార్కెట్లకు సానుకూలాంశమని పేర్కొంది. భారత కరెన్సీ బలపడటానికి దోహదం చేస్తుందని రాసుకొచ్చింది. భారత్– అమెరికా మధ్య మధ్యంతర వాణిజ్యఒప్పందం ఖరారైన సంగతి తెలిసిందే. ఈ డీల్ నేపథ్యంలో భారత ఉత్పత్తులపై ఉన్న 50శాతం సుంకాలు 18 శాతానికి తగ్గాయి. పాకిస్థాన్, చైనా, శ్రీలంక, బంగ్లాదేశ్ వంటి పలు ఆసియా దేశాలపై అగ్రరాజ్యం అమలుచేస్తోన్న సుంకాలతో పోలిస్తే ఇది తక్కువ కావడం గమనార్హం. "ఎగుమతులు పుంజుకుంటాయి. సుంకాలు తగ్గడం వల్ల అమెరికా (ఖూూ)తో భారత వాణిజ్య మిగులు తిరిగి పెరగడానికి మద్దతు లభిస్తుంది. ఎగుమతుల్లో పెరుగుదల దేశంలోకి డాలర్ ప్రవాహం పెగడానికి దోహదం చేస్తుంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ మెరుగుపడనుంది. ఇవన్నీ భారత ఈక్విటీలకు మరీ ముఖ్యంగా ఎగుమతి ఆధారిత రంగాలకు సానుకూలాంశాలు. వీటిని పరిగణనలోకి తీసుకుంటే అధిక సుంకాలు ఎదుర్కొంటున్న పలు ఆసియా దేశాలతో పోలిస్తే భారత్ స్థితి మెరుగపడింది. అయితే ఈ పరిణామాలతో మన దేశంలోకి విదేశీ సంస్థాగత పెట్టుబడులు అమాంతం కాకుండా క్రమక్రమంగా పెరిగే అవకాశం ఉంది" అని ఆ నివేదిక గుర్తుచేసింది. ఇరుదేశాల మధ్య తాత్కాలిక వాణిజ్య ఒప్పందానికి ఫ్రేమ్‌వర్క్ ఖరారయ్యింది.

ఈ ఒప్పందం ద్వారా భారతీయ ఎగుమతిదారులకు 30 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ తెరుస్తుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్న సంగతి తెలిసిందే. భారత్‌లోని రైతులు, ఎంఎస్ఎంఈలు, స్టార్టప్ ఆవిష్కర్తలు, మత్స్యకారులకు కొత్త అవకాశాలు సృష్టిస్తుందని కేంద్రం వెల్లడించింది.



## యురేనియం శుద్ధిపై తగ్గేదే లేదు..

అమెరికాతో అణు చర్చలు జరుగుతోన్న వేళ ఇరాన్ కీలక వ్యాఖ్యలు చేసింది. యురేనియం శుద్ధిపై తాము వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేసింది. తమను ఎవరూ భయపెట్టలేరంటూ అగ్రరాజ్యంపై కవ్వింపులకు పాల్పడింది. ఈ మేరకు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి వ్యాఖ్యలు చేశారు. "అమెరికాపై మాకు పెద్దగా నమ్మకం లేదు. యురేనియం శుద్ధిపై మేమెందుకు వెనక్కి తగ్గాలి. ఒకవేళ మాపై యుద్ధం ప్రకటించినా మేం దాన్ని వదిలేయబోం. ఎందుకంటే మమ్మల్ని శాసించే హక్కు ఎవరికీ లేదు. ఈ ప్రాంతంలో వారి (అమెరికాను ఉద్దేశిస్తూ) సైనిక మోహరింపు మమ్మల్ని భయపెట్టలేదు" అని అరాఘ్చి వ్యాఖ్యానించారు. ఇక, అమెరికాతో చర్చల గురించి తమ వ్యూహాత్మక భాగస్వామ్య దేశాలైన చైనా, రష్యాను కూడా సంప్రదిస్తున్నట్లు ఇరాన్ మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. ఒమన్ వేదికగా ఇరాన్, అమెరికా మధ్య పరోక్ష చర్చలు జరుగుతున్న సంగతి తెలిసిందే. అణు కార్యక్రమంపై భవిష్యత్ సంప్రదింపులకు బాటలు వేసేందుకే ఇరు దేశాలు ఈ చర్చల్లో పాల్గొన్నట్లు తెలుస్తోంది. అయితే, ఇదే సమయంలో గల్ఫ్ ప్రాంతంలో అమెరికా తమ సైనిక మోహరింపును పెంచుతోంది. అణు ప్రణాళికలకు సంబంధించి ఇరాన్‌పై ఒత్తిడి పెంచే ఉద్దేశంతోనే ఈ మోహరింపులు చేపట్టినట్లు తెలుస్తోంది. ఒకవేళ చర్చలు విఫలమైతే దాడులకు దిగుతామని అగ్రరాజ్యం సంకేతాలిచ్చింది. ఈ పరిణామాలతో మధ్యప్రాచ్యంలో పరిస్థితులు మళ్లీ నివురుగప్పిన నిప్పులా మారాయి.

## ప్రతి ఓటరూ పోలింగ్ కేంద్రానికి వచ్చేలా చూడాలి: నేతలతో సీఎం రేవంత్

హైదరాబాద్: మున్సిపల్ ఎన్నికల్లో నేతలు సమన్వయంతో ముందుకెళ్లాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఎన్నికల ప్రచారం, ఇతర అంశాలపై కాంగ్రెస్ ముఖ్యనేతలు, మంత్రులతో సీఎం జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు.

పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా పార్టీ స్థితిగతులపై సీఎం రేవంత్ ఆరా తీశారు. బలహీనంగా ఉన్న మున్సిపాలిటీల్లో పోలింగ్ వ్యూహంపై చర్చించారు. స్థానిక నేతల నేతృత్వంలో పోల్ మేనేజ్‌మెంట్ జరిగేలా చూడాలని మంత్రులకు సూచించారు. ప్రతి ఓటరూ పోలింగ్ కేంద్రానికి వచ్చేలా చూడాలన్నారు. ఇవాళ, రేపు ఓటర్లకు నేతలు అందుబాటులో ఉండాలని రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.



## సింగరేణిని రక్షించేది భాజపా మాత్రమే: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



గోదావరిఖని: సింగరేణి సంస్థ అప్పుల ఊబిలో విలవిలాడుతోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి (ఖఅంష్ఘుఅ =వఎఎఎ) అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటేయాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గోదావరిఖనిలోని గాంధీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. "బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు తెలంగాణకు అన్యాయం చేశాయి. రామగుండం ప్రాంత అభివృద్ధి కోసం గత ప్రభుత్వం చేసిందేమీ లేదు. ఇక్కడ ఎరువుల కర్మాగారం, పవర్ ప్రాజెక్టు తెచ్చింది భాజపా. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడులు పెడుతుంటే బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు దోచుకుంటున్నారు. రామగుండంలో భాజపాను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తాం. రూ.20వేల కోట్లతో ఎన్టీపీసీని విస్తరిస్తాం. సింగరేణిని రక్షించుకోకపోతే మూతపడే ప్రమాదముంది. కార్మికుల శ్రమను ప్రభుత్వం దోచుకుంటోంది. తెలంగాణలో కారు పంక్చర్ అయింది. ఆ పార్టీలో ఉన్న నాయకులు తలో దారి చూసుకున్నారు. బీఆర్ఎస్‌లో జరిగిన అవినీతిపై కేసీఆర్ కుమార్తె కవిత కూడా చెబుతున్నారు. నిరుద్యోగులకు నెలకు రూ.4వేలు ఇస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఎవరికైనా ఇచ్చారా?కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా అమలు కాలేదు. రౌడీయిజం, గూండాయిజంపై ఆ పార్టీ బతుకుతోంది.కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతోనే మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు నడుస్తున్నాయి. కేంద్రం నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. సింగరేణిని రక్షించేది భాజపా మాత్రమే. కోల్‌బెల్ట్ ప్రాంతంలో కాషాయ జెండా ఎగిరితేనే సింగరేణికి మనుగడ ఉంటుంది. గతంలో బీఆర్ఎస్‌కు చెప్పిన విధంగా ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలి. ఈ ఎన్నికల్లో భాజపా అభ్యర్థులను ప్రజలు గెలిపించాలి" అని కిషన్‌రెడ్డి కోరారు.



## స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానానికి విపక్షాలు సన్నద్ధం

న్యూఢిల్లీ: పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు సజావుగా సాగకపోవడంతో ఇటు అధికార పక్ష సభ్యులు, అటు విపక్ష సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గందరగోళ పరిస్థితుల మధ్య ఉభయసభల కార్యకలాపాలకు తరచు అంతరాయం కలుగుతోంది. సభలో తమను మాట్లాడేందుకు అనుమతించడం లేదంటూ విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే యోచనలో విపక్షాలు ఉన్నట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే నోటీసులు కూడా ఇచ్చినట్టు చెబుతున్నారు. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలంటే 14 రోజుల ముందుగా నోటీసులు ఇవ్వాలి. ఆప్రకారం బడ్జెట్ రెండో విడత సమావేశాల్లో అవిశ్వాస తీర్మనం సభలో చర్చకు వచ్చే అవకాశం ఉంటుంది. బడ్జెట్ తొలి విడత సమావేశాలు జనవరి 8న ప్రారంభమై ఫిబ్రవరి 13తో ముగియనున్నాయి. రెండో విడత సమావేశాలు మార్చి 9న తిరిగి ప్రారంభమై ఏప్రిల్ 2 వరకూ జరుగుతాయి. కాగా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కార్యాలయంలో సోమవారం ఉదయం జరిగిన సమావేశంలో అవిశ్వాస తీర్మానంపై నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. టీఎంసీ, డీఎంకే, వామపక్షాలు, సమాజ్‌వాదీ పార్టీ, శివసేన (యూబీటీ), ఎన్‌సీపీ (ఎస్పీ) తదితరల పార్టీల ఎంపీలు ఈ సమావేశంలో పాల్గొన్నట్టు సమాచారం.

**ఓం బిర్లాకు కాంగ్రెస్ మహిళా ఎంపీలు లేఖ...** మరోవైపు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై దాడికి సిద్ధమయ్యామంటూ తమపై అసత్య ఆరోపణలు చేయడాన్ని కాంగ్రెస్ మహిళా ఎంపీలు ఖండించారు. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా తాము నిరసన తెలిపామని, హింసకు దిగాలని తాము అనుకోలేదని, విపక్షాలను ఎదుర్కొనే ధైర్యం ప్రధానికి లేకపోవడం వల్లే భయపడి సభకు రాలేదని మహిళా ఎంపీలు ఆ లేఖలో పేర్కొన్నారు. లోక్‌సభ స్పీకర్ నిష్పక్షపాతంగా ఉండాలన్నారు. ఎంపిక చేసి మరీ 8 మంది విపక్ష ఎంపీలపై సస్పెన్షన్ వేటు వేశారని, మాజీ ప్రధానులపై బీజేపీ ఎంపీ అనుచిత వ్యాఖ్యలు చేస్తే పట్టించుకోలేదని అన్నారు. కాంగ్రెస్ ఎంపీ జోతిమణి, పలువురు మహిళా ఎంపీలు ఈ లేఖపై సంతకాలు చేశారు.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com